ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
శనివారం 27 జూలై 2024 | 5





సమీక్ష చేస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

చాలా అదృష్టం.. తప్పిన ప్రమాదం!



చెట్టుకూలి పడిన విద్యుత్ స్తంభాలు.. కారుపై పడిన తీగలు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 26: రాజమహేంద్రవరం టీటీడీ కళ్యాణ మండపం రోడ్డులో శుక్రవారం సాయంత్రం అకస్మాత్తుగా ఒక చెట్టు కూలిపోయింది. దాంతో ఆ చెట్టు కింద నుంచి వెళ్లిన 11 కేవీ విద్యుత్ లైన్లు ఉన్న రెండు విద్యుత్ స్తంభాలు కూడా పడిపోయాయి. వాటి కరెంటు వైర్లు వెళుతున్న రెండు కార్లపై పడ్డాయి. అయితే విద్యుత్ వైర్లపై చెట్టుపడిన వెంటనే ట్రిప్ అయ్యి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. కార్లలో ఉన్నవారు సురక్షితంగా బయటపడ్డారు. విద్యుత్ సరఫరాతో వైర్లు ఆ కార్లపై పడివుంటే చాలా ప్రమాదం అయ్యేది. వెంటనే విద్యుత్‌శాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ పనులు చేపట్టారు. గత నాలుగురోజులపాటు కురిసిన వర్షాలకు పూర్తిగా నానిపోయిన చెట్టు అకస్మాత్తుగా కూలిపోయింది. విద్యుత్ వైర్లతో రెండు స్తంభాలు కూలడంతో స్థానికులు భయాందోళనతో పరుగులు తీశారు. విద్యుత్ శాఖాధికారులు వెంటనే అక్కడకు చేరుకుని మరమ్మత్తులు ప్రారంభించడంతో ఊపిరిపీల్చుకున్నారు.

సోమవారం నుంచి బడుల్లో ఆకస్మిక తనిఖీలు : కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, జూలై26(ఆంధ్రజ్యోతి): సోమవారం నుంచి స్కూల్స్‌లో ఆకస్మిక తనిఖీలు చేస్తానని కలెక్టర్ పి.ప్రశాంతి స్పష్టంచేశారు. ఆ సమయంలో పారిశుధ్యం సహా అన్ని అంశాలనూ పరిశీలించడం జరుగుతుందన్నారు. అలసత్వాన్ని సహించేది లేదని స్పష్టంచేశారు. పాఠశాల విద్యాశాఖాధికారులతో శుక్రవారం ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యవేక్షణ, అప్రమత్తత వల్ల అభ్యసనలో మెరుగైన ఫలితాలతోపాటు నిర్వహణా సామర్థ్యాలను గణనీయంగా పెంచడానికి వీలు కలుగుతుందన్నారు. విద్యార్థుల హాజరు, పాఠశాలల నిర్వహణ, మధ్యాహ్న భోజనం, నూరుశాతం చేరికలు, స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంప్రూమెంట్ పనులు తదితర అంశాలపై అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో ఎస్‌వోపీని తప్పకుండా అమలుచేయాలన్నారు. దీనిపై ఉపాధ్యాయులను తనిఖీ అధికారులు జాగ్రత్తం చేయాలన్నారు. ఇప్పటి వరకూ గమనించిన లోటుపాట్లు, వాటి పరిష్కారాలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇకో క్లబ్‌పై విద్యార్థుల్లో చైతన్యం తీసుకురావాలని ఆమె చెప్పారు. మొక్కలు నాటడడంతోపాటు సంరక్షించేలా చూడాలన్నారు. ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడంపై స్కూల్స్ వారీగా సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పాఠశాల విద్యాధికారి కె.వాసుదేవరావు, ఎస్ఎస్ఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.సుభాషిణి పాల్గొన్నారు.

అదే ఉధృతి



కొవ్వూరు గోష్పాద క్షేత్రం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

- ధవళేశ్వరం బ్యారేజీ వద్ద కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరిక
- స్వల్పంగా పెరుగుతున్న గోదావరి
- ఇప్పటికే 743 టీఎంసీలు సముద్రం పాలు
- రాత్రి 11 గంటలకు బ్యారేజీ నుంచి 12,44,232 క్యూసెక్కులు సముద్రంలోకి
- నష్టం అంచనాలకు కమిటీలు నియమించిన జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): అఖండ గోదావరి ఉగ్రంగా ప్రవహిస్తోంది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ఇంకా రెండు మూడు రోజులపాటు మొదటి ప్రమాద హెచ్చరిక అమలులో ఉండవచ్చని అధికారులు చెబుతున్నారు. శుక్రవారం రాత్రి 11 గంటలకు ధవళేశ్వరం బ్యారేజీ నీటిమట్టం 13.50 అడుగులుగా ఉంది. బ్యారేజీ నుంచి 12,44,232 క్యూసెక్కుల నీరు సముద్రంలోకి పోతోంది. భద్రాచలం వద్ద 48.60 అడుగులుగా ఉంది. ఎగువ భాగంలో వాతావరణం మేఘావృతంగా ఉంది. ప్రస్తుతం జిల్లాలో వర్షాలు లేవు. కానీ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడడం వల్ల మూడురోజులపాటు ఓ మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉన్నట్టు హెచ్చరిక చేశారు. ఈనెల 19వ తేదీకి ధవళేశ్వరం వద్ద సుమారు 3.6 లక్షల క్యూసెక్కుల వరద సముద్రంలోకి పోతుండగా, అప్పటి నుంచి వరద పెరుగుతూ ఉండడంతో 22వ తేదీ ఉదయం ఏడు గంటలకు మొదటి హెచ్చరిక జారీచేశారు. తర్వాత రెండో ప్రమాద హెచ్చరిక జారీకావడం, కాస్త వరద తగ్గడంతో దాన్ని ఉపసంహరించుకున్నారు. కానీ మళ్లీ వరద పెరగడంతో ప్రస్తుతం భద్రాచలం, ధవళేశ్వరం బ్యారేజీ వద్ద కూడా మొదటి ప్రమాద హెచ్చరికలు కొనసాగుతున్నాయి. అంతేకాక ఇక్కడ నీటిమట్టం రెండో ప్రమాద హెచ్చరికకు దగ్గరగా ఉంది. వరద ఉధృతి స్వల్పంగానే పెరుగుతున్నా గోదావరి ఉగ్రరూపంలోనే ఉంది. పోలవరం స్పిల్‌వే, ఎగువ కాఫర్ డ్యామ్ వద్ద సముద్రాన్ని తలపిస్తోంది. ముఖ్యంగా రాజమహేంద్రవరం-కొవ్వూరు మధ్య గోదావరి తీవ్రరూపం దాల్చింది. గోదావరి స్నాన ఘట్టాలలో నిషేధాజ్ఞలు కొనసాగుతున్నాయి. పునరావాస కేంద్రాలు కూడా కొనసాగుతున్నాయి. ధవళేశ్వరం సాయిబాబా గుడి వద్ద డ్రైన్ స్లూయిజ్‌ను గోదావరి వరద ఎగదన్నడంతోపాటు రాజమహేంద్రవరంలోని పలు ప్రాంతాల్లో డ్రైన్లు పొంగి వీధులను ముంచెత్తాయి.

నష్టాలు అంచనాలకు కమిటీలు నియమించిన కలెక్టర్

జిల్లాలో ఇటీవల భారీగా కురిసిన వర్షాలు, వరదలతోపాటు బురదకాలువ, జెల్లకాలువ, కొవ్వాడ, ఎర్రకాలువ వంటివి ఉప్పొంగడంతో జరిగిన నష్టాలను తక్షణం లెక్కించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లాలో 119 ఇళ్లకు నష్టం జరిగిన ప్రాథమిక అంచనారాగా, రెవెన్యూ, హౌసింగ్ ఏఈ, ఎంపీడీవోలతో ఒక కమిటీని వేసి ఒక్కరోజులోనే నష్టాల నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. వ్యవసాయశాఖకు సంబంధించి గ్రామ, మండల స్థాయిలలో కమిటీలు వేసి మూడు రోజుల్లో నివేదిక ఇవ్వాలన్నారు. మిగిలిన శాఖలలో జరిగిన నష్టాల గురించి కూడా ఎన్యుమరేషన్ వెంటనే జరగాలన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వరద, భారీ వర్షాల వల్ల బాధితులుగా ఉన్నవారికి తక్షణం రూ.3 వేల వంతున సహాయం చేయాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. జిల్లా స్థాయిలో కూడా గతంలో ఎన్నడూ లేనంతగా ఎర్రకాలువ బాధితులకు పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేశారు. వరద బాధితులకు యంత్రాంగం అండగా నిలిచింది.

పెరుగుతోంది..

కొవ్వూరు, జూలై 26 : గత వారం రోజులుగా గోదావరి వరద తగ్గుతూ, పెరుగుతూ దోబూచులాడుతోంది. అఖండ గోదావరి మళ్లీ పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు వరద ప్రవాహం నదిలో వచ్చి చేరుతోంది. దీంతో గోదారమ్మ పొటెత్తి నిండుకుండలా పరవళ్లు తొక్కుతోంది. ఎగువ నుంచి వరద ప్రవాహం అధికంగా వచ్చి నదిలో చేరడంతో వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉందని ఏజీఆర్‌బీ అధికారులు చెబుతున్నారు. దిగువన ధవళేశ్వరం వద్ద మూడో ప్రమాద హెచ్చరిక స్థాయి వరకు పెరిగి నెమ్మదిగా తగ్గుముఖం పట్టవచ్చని కొవ్వూరు అఖండ గోదావరి కుడిగట్టు విభాగం ఏఈఈ ఆర్ సునీల్‌బాబు తెలిపారు. కాగా గత వారం రోజులుగా కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోని ప్రధాన స్నాన ఘట్టాలు వరద ముంపులోనే కొనసాగుతున్నాయి. నదీ ప్రవాహం ఉధృతంగా ఉండడంతో నదిలోకి ఎవరు వెళ్లకుండా అధికార పార్టీ యంత్రాంగం చర్యలు చేపట్టింది. విజ్జేశ్వరం నుంచి పోలవరం దాకా ఏటిగట్లను పరిశీలించామని ప్రస్తుతం ఎటువంటి ప్రమాదం లేదని, ముందస్తు చర్యలు కూడా చేపట్టినట్టు సునీల్‌బాబు తెలిపారు.



గోదావరి వరద వల్ల స్థానిక కుమారి టాకీస్ సమీపంలోని ఘాట్ వద్ద ఖాళీగా కూర్చున్న మత్స్యకారులు



ఏటిగట్టు ఆనుకుని ఉన్న లంక భూమి కోతకు గురై తాడిచెట్టు కొట్టుకుపోతున్న దృశ్యం

ఏటిగట్లు బలహీనం.. ఆందోళన చెందుతున్న గోదావరి తీరం జనం

సీతానగరం, జూలై 26 : గోదావరి మళ్లీ పెరుగుతుండడంతో తీరం వెంబడి ఉన్న గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సీతానగరం మండలంలోని లంక గ్రామమైన ములకల్లంక వెళ్లడానికి ప్రజలు మరబోట్లను ఆశ్రయిస్తున్నారు. అయితే లైఫ్ జాకెట్లు వినియోగించడం లేదు. లంక గ్రామంలో వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి అవసరమైన వారికి వైద్య సేవలు అందిస్తున్నారు. గోదావరి పరవళ్లు తొక్కుతుండడంతో బొబ్బిల్లంక స్లూయిజ్ నుంచి మండలంలోని మురుగు కాలువ నీరు గోదావరిలో కలిసే అవకాశం లేకపోవడంతో పంట భూములు ఇంకా నీటిలోనే ఉన్నాయి. బొబ్బిల్లంక వద్ద ఏటిగట్టు బలహీనంగా ఉండడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. బొబ్బిల్లంక అంబేద్కర్ బొమ్మ వద్ద, అశోక్ నగర్ వద్ద ఏటిగట్టు బలహీనంగా ఉందని, గోదావరి ఇంకా పెరిగితే ఏటిగట్టు ప్రమాదంలో పడుతుందని గ్రామస్తులు అంటున్నారు. గోదావరి లెఫ్ట్ బ్యాంకు కెనాల్ ఏఈ శివప్రసాద్ ఏటిగట్టును శుక్రవారం పరిశీలించి ఆయన మాట్లాడుతూ ఏటిగట్టుకు గండ్లు పడకుండా చర్యలు చేపడుతున్నామని చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి ప్రశాంతి

ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యత కల్పించాలి

సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులు లాభసాటి అయ్యేలా కృషి

పొలంబడి 'గాప్' సర్టిఫికేషన్ శిక్షణలో కలెక్టర్ పి ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, జూలై 26: వ్యవసాయరంగంలో ప్రకృతి వ్యవసాయానికి తగిన ప్రాధాన్యం కల్పించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. రాజమహేంద్రవరంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం 2024-25 సంవత్సరంలో పొలంబడి జీఏపీ (గుడ్‌అగ్రికల్చర్ ప్రాడక్ట్) సర్టిఫికేషన్ ప్రోగ్రామ్‌పై వ్యవసాయ అధికారులకు నిర్వహించిన జిల్లాస్థాయి ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు శాస్త్రీయ వ్యవసాయ సాగు విధానం దిశలో ప్రకృతి వ్యవసాయం చేపట్టేలా తీర్చిదిద్దడమే కాకుండా, వారు పండించిన పంటలకు తగిన ధరలు కలుగజేసేలా కృషి చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయంలో రైతులకు ఆధునిక పద్ధతులు ఆచరించేలా చేయడం, పొలంబడి కార్యక్రమాలను గ్రామం ఒక యూనిట్‌గా చేపట్టాల్సి ఉందన్నారు. ఈ ప్రక్రియలో వ్యవసాయ అధికారుల పాత్ర కీలకం అన్నారు. రైతులను, మార్కెటింగ్ వర్గాలను భాగస్వామ్యం చేసి మనందరి కార్యక్రమనే దృక్పథం కలుగజేస్తే అనుకున్న ఫలితాలు సాధించడం సాధ్యమవుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయ లక్ష్యంతో అన్నదాతలకు తగిన ప్రోత్సాహం, మద్దతు ఇవ్వడం ద్వారా వారిని ఆరోగ్యదాతలుగా మార్చడం సాధ్యమవుతుందన్నారు. మంచి వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహించి తగిన గుర్తింపు తీసుకొని రావడంలో అధికార ధోరణిలో కాకుండా రైతుల, సామాజిక కోణంలో ప్రోత్సాహం అందించి వారిని భాగస్వామ్యం చేయాలని కోరారు. నేటి ఆధునిక పోకడలను దృష్టిలో పెట్టుకొని పొలంబడులు క్షేత్రస్థాయిలో నిర్వహిస్తూ మేలైన వ్యవసాయ యాజమాన్య పద్ధతులు రైతులకు అందుబాటులో తీసుకొని రావడం వ్యవసాయ అధికారుల కర్తవ్యం అని స్పష్టం చేశారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ మాధవరావు మాట్లాడుతూ గతేడాది జిల్లాలో కేవలం ఒక్క గాప్ పొలంబడి కార్యక్రమం నిర్వహించామని, మంచి వ్యవసాయ పద్ధతులను అభ్యసించే దిశగా మరిన్ని కార్యక్రమాలు నిర్వహించేందుకు శిక్షణ తరగతులను చేపట్టినట్టు చెప్పారు. ఈ శిక్షణలో జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు, డివిజనల్, మండలస్థాయి వ్యవసాయాధికారులు, మాస్టర్ శిక్షకులు కె.కమల్‌రాజు, ఎ.భీమారాజు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు పెంచాలి: కలెక్టర్

రాజమహేంద్రవరం అర్బన్, జూలై26: అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలని కలెక్టర్ ప్రశాంతి అన్నారు. అలాగే జిల్లాలో రోగ నిరోధక టీకా లక్ష్య సాధన క్షేత్రస్థాయిలో పక్కాగా నిర్వహించాలని పేర్కొన్నారు. శుక్రవారం రాజమహేంద్రవరంలోని జిల్లా కలెక్టరేట్ కార్యాలయం సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్యశాఖ ద్వారా జిల్లాలో అమలు జరుగుతున్న ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రోగ నిరోధక శక్తిని పెంచే టీకాలను నిర్దేశించిన వయస్సు కల్గిన పిల్లలందరికీ క్రమం తప్పకుండా వేయాల్సి ఉందన్నారు. ఈమేరకు తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణ లక్ష్యంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలు అందించాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డిప్యూటీ డీఅండ్‌ఎంహెచ్‌వోలు డాక్టర్ జె.సంధ్య, డాక్టర్ ఎం.శ్రీహరిబాబు,డీఐవో డాక్టర్ రాజకుమారి పాల్గొన్నారు.





ట్రాఫిక్, హోంగార్డుల సిబ్బందితో జరిగిన పరేడ్‌లో గౌరవ వందనం స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్.. పక్కన కవాతు జరుగుతున్న దృశ్యం

ప్రజల రక్షణే పోలీస్ విధుల లక్ష్యం

- సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట
- జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్
- పరేడ్ గ్రౌండ్స్‌లో ట్రాఫిక్, హోంగార్డు సిబ్బంది కవాతు

రాజమహేంద్రవరం, జూలై26(ఆంధ్రజ్యోతి): ప్రజలకు రక్షణ కల్పించడమే పోలీస్ విధుల లక్ష్యమని ఎస్పీ డి.నరసింహ కిషోర్ పేర్కొన్నారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో సాయుధ రిజర్వు, శాంతి భద్రతలు, ట్రాఫిక్, హోంగార్డు విభాగాల సిబ్బంది శుక్రవారం కవాతు నిర్వహించారు. వారి నుంచి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు భద్రత కల్పించే విషయంలో పోలీసులు పూర్తి సమన్వయంతో పనిచేయాలన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా నడుచుకోవడంతోపాటు మనోధైర్యాన్ని కల్పించాలన్నారు. ఈ క్రమంలో ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ఎదుర్కోడానికి నిరంతరం సిద్ధంగా ఉండాలన్నారు. పోలీసులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటేనే మెరుగైన సేవలు అందించే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి రోజూ వ్యాయామం, యోగా చేయడం మేలు చేస్తుందన్నారు. సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని.. అదే సమయంలో సిబ్బంది కూడా ఆరోగ్యం విషయంలో అశ్రద్ధ చేయరాదన్నారు. అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు ఆలస్యం చేయకుండా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకొచ్చి అవసరమైన వైద్య సహాయం పొందాలని చెప్పారు. విధులతోపాటు కుటుంబానికి కూడా ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సిబ్బంది తమకు ఎలాంటి సమస్య ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలని.. మానసికంగా కుంగుబాటుకు గురికావద్దని ఆయన సూచించారు. పరేడ్‌లో పాల్గొన్న సిబ్బందితో మాట్లాడి వారి ఇబ్బందులపై ఆరా తీశారు. ప్రతి శుక్రవారం పరేడ్ నిర్వహించి అన్ని విభాగాలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అడిషనల్ ఎస్పీలు ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు (పరిపాలన), ఎల్.చెంచిరెడ్డి (సాయుధ రిజర్వు), డీఎస్పీలు రవికుమార్ పాల్గొన్నారు.



న్యాయ విజ్ఞాన సదస్సులో ప్రకాశ్‌బాబును సత్కరిస్తున్న దృశ్యం

ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలు

డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రకాశ్‌బాబు

రాజమహేంద్రవరం/దివాన్‌చెరువు జూలై 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ర్యాగింగ్ వంటి అనైతిక పనులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకునే హక్కు యాజమాన్యానికి ఉంటుందని, ఒకవేళ వారు అలా చేయకపోతే వారిపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు స్పష్టంచేశారు. మాదకద్రవ్యాల నిషేధం, ర్యాగింగ్ నిషేధ చట్టంపై రాజమహేంద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్, మాదకద్ర వ్యాలకు దూరంగా ఉండాలన్నారు. చెడు స్నేహాలు, పరిస్థితుల ప్రభావంతో వాటి ఉచ్చులో పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. తాత్కాలిక ఆనందం కోసం వాటిని తీసుకుంటే ఆరోగ్యం పాడవడంతోపాటు సమాజంలో చులకన అవుతారన్నారు. మాదకద్రవ్యాలు కలిగి ఉండడం, వాడడం, విక్రయం, నిల్వ, తయారీ వంటివ న్నీ క్రిమినల్ నేరాల కింద చట్టం పరిగణిస్తుందన్నారు. మాదకద్రవ్యాలకు అలవాటుపడిన వారు మార్పుకోసం తమను సంప్రదిస్తే ఉచిత వైద్య సహాయం అందించే ఏర్పాటు చేస్తామన్నారు. అలాంటి వారిపై ఎలాంటి నేర విచారణా ఉండదని చెప్పారు. ర్యాగింగ్ కేసుల్లో నేరం రుజువై 6 నెలల కంటే ఎక్కువకాలం శిక్షపడితే కళాశాల నుంచి డీబార్ చేస్తారన్నారు. అనంతరం రోడ్డు ప్రమాదాల నివారణపై రాజమండ్రి రైల్వే స్టేషన్లో అవగాహన కార్యక్రమంలోనూ ఆయన పాల్గొన్నారు.

రూ.2.20 కోట్లతో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి పరార్

- రాజమహేంద్రవరంలోని దానవాయిపేట హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వద్ద ఘటన
- నిందితుడు ఏటీఎంలో డబ్బులు పెట్టే ఉద్యోగం
- అతని సొంతూరు కపిలేశ్వరపురం మండలం మాచరవమ్మ
- గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు
- పోలీసుల తీరుపైనా అనుమానాలు

- వివరాలు మెయిన్‌లో

విద్యుత్ సిబ్బంది సాహసం

- 7లో

- ప్రాణాలకు తెగించి విధులు నిర్వర్తించిన సిబ్బంది.. మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో విద్యుత్ పునరుద్ధరణ పనులు

కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే కృష్ణబాబు మృతికి రాష్ట్ర అసెంబ్లీలో సంతాపం

కొవ్వూరు, జూలై 26: కొవ్వూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పెండ్యాల వెంకట కృష్ణారావు (కృష్ణబాబు) మృతికి రాష్ట్ర అసెంబ్లీ సమావేశం సంతాపం తెలియజేసింది. రాష్ట్ర అసెంబ్లీలో శుక్రవారం శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు రాష్ట్రంలో ఇటీవల మరణించిన ప్రముఖులకు నివాళులు అర్పించాలని కోరుతూ కృష్ణబాబు మృతికి సంతాపం తెలియజేశారు. కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే, ప్రముఖ పారిశ్రామికవేత్త, దొమ్మేరు జమిందార్ పెండ్యాల వెంకట కృష్ణారావు(కృష్ణబాబు) అనారోగ్యంతో 2024 మే 21వ తేదీన కన్నుమూశారు. కొవ్వూరు నియోజకవర్గం నుంచి కృష్ణబాబు అయిదుసార్లు తెలుగుదేశం పార్టీ తరపున ఎమ్మెల్యేగా గెలుపొందారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు పిలుపుమేరకు రాజకీయాలలోకి వచ్చి కొవ్వూరు నియోజకవర్గం నుంచి 1983, 1985, 1989, 1994 ఎన్నికల్లో వరుసగా టిడిపి తరపున ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1999లో ఓటమిపాలైనప్పటికీ మళ్లీ 2004లో మరోసారి విజయం సాధించారు. అలా నియోజకవర్గంలో అత్యధికసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై 23 ఏళ్లపాటు శాసనసభ్యునిగా పనిచేసిన నాయకుడిగా రికార్డు నెలకొల్పారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజనతో కొవ్వూరు ఎస్సీ రిజర్వు కావడంతో ఆయన పోటీకి దూరమయ్యారు. నిస్వార్థంగా ప్రజాసేవ చేయడంతో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో తిరుగులేని నేతగా దశాబ్దాలపాటు పేరుపొందారు. కొవ్వూరు నియోజకవర్గంతోపాటు, పోలవరం, గోపాలపురం, చింతలపూడి, తణుకు నియోజకవర్గ అభ్యర్థుల గెలుపులో కీలకపాత్ర పోషించేవారని సభలో కొనియాడారు.

కాకినాడలోని పురాతన కట్టడాలను సంరక్షించుకోవాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ రాజేంద్రసింగ్

● రామన్ మెగసెసె అవార్డు గ్రహీత డాక్టర్ రాజేంద్రసింగ్

జేఎన్టీయూకే, జూలై 26: కాకినాడ నగరంలోని పురాతన సంపద, కట్టడాలను సంరక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని వాటర్‌మెన్ ఆఫ్ ఇండియా రామన్ మెగసెసె అవార్డు గ్రహీత డాక్టర్ రాజేంద్రసింగ్ అన్నారు. వర్సిటీలోని సెనేట్ హాల్లో జేఎన్టీయూకే, పీడబ్ల్యూసీఏఫ్ సంస్థల ఆధ్వర్యంలో వారసత్వ సంపద భవిష్యత్తు, కార్యాచరణ అనే అంశంపై శుక్రవారం నగర ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి చీఫ్ ఇంజనీర్ వి.శ్రీనివాసులు, పీడబ్ల్యూసీఏఫ్ సమన్వయకర్త పి.ఆదినారాయణ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా రాజేంద్రసింగ్, విశిష్ట అతిథిగా ఇన్‌ఛార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ, గౌరవఅతిథులుగా సామాజిక కార్యకర్త, జనసేన పార్టీ సీనియర్ నేత బొలిశెట్టి సత్యనారాయణ, సంకురాత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, పర్యావరణవేత్తలు రత్నం, మృత్యుంజయరావు పాల్గొన్నారు. రాజేంద్రసింగ్ మాట్లాడుతూ కాకినాడలో పురాతన కళాశాలలు, జాతీయ వారసత్వ సంపద, మడ అడవులు ఉన్నాయన్నారు. అనంతరం ఇన్‌ఛార్జి వీసీ మురళీకృష్ణ మాట్లాడుతూ వర్సిటీలో 75ఏళ్లు దాటిన అతిపెద్ద వృక్షాలున్నాయని, వాటిని సంరక్షించేందుకు ప్రతిఏటా పెన్షన్ ఇస్తున్నామన్నారు. డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ మడ అడవుల్లోని ప్రతిజీవి వారసత్వ సంపదేనని తెలిపారు. సత్యనారాయణ మాట్లాడుతూ మడ అడవులు, హోప్ ఐలాండ్‌వల్ల కాకినాడ నగరం సంరక్షింపబడుతోందన్నారు. కార్యక్రమంలో రెక్టార్ కేవీరమణ, రిజిస్ట్రార్ ఎల్.సుమలత, ఓఎస్డీ కోటేశ్వరరావు, అధ్యాపకులు, పర్యావరణవేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

సత్యదేవుడి విమానగోపురం స్వర్ణమయానికి

కొలతలు తీసిన టీటీడీ బృందం


సత్యదేవుడి విమానగోపురం కొలతలు తీసుకుంటున్న టీటీడీ బృందం

● అంచనా వ్యయం రూ.10కోట్లకు పెరిగే అవకాశం

అన్నవరం, జూలై 26: రత్నగిరివాసుడైన సత్యదేవుడి విమానగోపురం స్వర్ణమయం చేసేందుకు అడుగులు వడివడిగా పడుతున్నాయి. ఇప్పటికే ఒక పర్యాయం దేవదాయశాఖ స్థపతి పరమేశ్వరప్ప నేతృత్వంలో ఒక కమిటీ పరిశీలన జరిపి సుమారు 11కేజీల బంగారం పడుతుందని అంచనా వేయగా దేవదాయశాఖ కమిషనర్ ఆదేశాలతో శుక్రవారం టీటీడీ డిప్యూటీ ఈఈ చంద్రమౌళిరెడ్డి, అసిస్టెంట్ స్థపతి మురళీశంకర్, అప్రయిజర్ నాగరాజు, సూపరింటెండెంట్ మనోహర్‌ల బృందం విమానగోపురం కొలతలను తీసుకున్నారు. విమానగోపురంపై దేవతామూర్తుల విగ్రహాలు ఉండడంతో ప్రతీ అంగుళం కొలతలు తీసుకున్నారు. 10 అడుగుల వెడల్పు, 12 అడుగుల ఎత్తు ఈ ఆలయశిఖరంపై సుమారు 50 దేవతామూర్తులు విగ్రహాలున్నాయి. అప్పటి అంచనా ప్రకారం సుమారు 7.5 కోట్లు కాగా, ప్రస్తుతం ధరలు అప్పటితో పోల్చితే పెరగడం, దేవతామూర్తుల విగ్రహాలు కొలతలు ప్రాథమికంగానే తీసుకోవడంతో అంచనా వ్యయం సుమారు రూ.10 కోట్లకు చేరుతుందన్నారు. దీనిపై దేవస్థానం ఈవో రామచంద్రమోహన్‌తో చర్చించి నివేదకను దేవదాయకమిషనర్‌కు అందజేస్తామని బృందసభ్యులు తెలిపారు. ఈనెల 30న అంచనా వ్యయం రిపోర్టు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నరసింహారెడ్డి తదితరులున్నారు.

తగ్గుతూ... పెరుగుతూ గోదావరి

● ధవళేశ్వరం వద్ద కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరిక
● కాటన్‌బ్యారేజ్ నుంచి 12.44లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి
● భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ

ధవళేశ్వరం, జూలై 26: వారం రోజులుగా గోదావరి ఉధృతి తగ్గుతూ పెరుగుతూ ప్రవహిస్తోంది. ఎగువ నుంచి వచ్చి చేరే వరదనీరు ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ నుంచి సముద్రంలోకి ప్రవహించేలోగా మరలా ఎగువన నీటి మట్టం పెరుగుతుంది. దీంతో ఎగువన భద్రాచలం వద్ద, దిగువన ధవళేశ్వరం వద్ద ప్రమాదహెచ్చరికలు కొనసాగుతూనే ఉన్నాయి. గురువారం మధ్యాహ్నానికి 2గంటలకు 13.40అడుగుల వరకు తగ్గిన నీటి మట్టం 12గంటలు పాటు నిలకడగా కొనసాగింది. ఆపై స్వల్పంగా పెరుగుతూ 15గంటల వ్యవధిలో 3 పాయింట్లు పెరిగి శుక్రవారం సాయంత్రం 5గంటలకు 13.70అడుగులకు చేరింది. మరలా తగ్గుముఖం పట్టి రాత్రి 7గంటలకు 13.50 అడుగులుగా ఉంది. కాటన్ బ్యారేజ్ నుంచి 12,44,232 క్యూసెక్కుల నీరు సముద్రంలోకి ప్రవహిస్తోంది. ఇదే సమయంలో భద్రాచలం వద్ద నీటి మట్టం రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. 48.60 అడుగులకు చేరుకుంది.


నాటుపడవపై చింతరేగుపల్లి చేరుకుంటున్న వరద బాధితులు


చింతూరులో మల్లెతోటకు విద్యుత్ సరఫరాకోసం మరమ్మతులు చేస్తున్న విద్యుత్‌శాఖ సిబ్బంది

మళ్లీ పెరుగుతున్న గోదావరి, శబరి

చింతూరు, జూలై 26 : తగ్గినట్టే తగ్గిన గోదావరి, శబరి నదులు మళ్లీ పెరుగుతున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రానికి భద్రాచలం వద్ద గోదావరి రెండో ప్రమాద హెచ్చరిక స్థాయికి అతి చేరువగా 48. 60 అడుగులకు చేరుకుంది. ఇక చింతూరు వద్ద శబరి నది 37.5 అడుగులకు చేరింది. దీంతో రహదారులు ఇంకా ముంపులోనే ఉండి రాకపోకలు దాదాపు వారం రోజులుగా స్తంభించిపోయాయి. ముంపు బాధితులతో పాటు అధికార యంత్రాంగం నాటు పడవలనే ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. పలు గ్రామాలకు చెందిన విద్యుత్ సరఫరా లైన్లు నీటమునగడంతో విద్యుత్‌శాఖ సిబ్బంది ముంపునకు గురైన విద్యుత్ స్థంభాల వద్దకు నాటు పడవలపై చేరుకొని ఆయా స్థంబాలను హైట్ టి రైజర్సు ద్వారా ఎత్తు పెంచి విద్యుత్ సరఫరా ఇచ్చే దిశగా చర్యలు చేపట్టారు. అల్లూరి సీతారామరాజు జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, డివిజనల్ పంచాయతీ అధికారి జీఎల్ఎన్‌వి రాఘవన్ బృందం ముంపు ప్రాంతాలలో సందర్శించి పారిశుధ్యం చర్యలు చేపట్టే దిశగా చర్యలు చేపట్టారు. అదే దశలో విస్తృతంగా మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయించారు.


ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ వద్ద వరద ఉధృతి

మెడికల్ ఆఫీసర్‌ను వేధించి

తిరిగి తప్పుడు ఆరోపణలు

● ఏపీపీహెచ్‌సీడీఏ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు
● సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని కలెక్టర్‌కు వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏపీపీహెచ్‌సీడీఏ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

కాకినాడ సిటీ, జూలై 26: జిల్లా ఫైలేరియా విభాగంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ కె.రాధాకృష్ణ కనిపించకపోవడానికి ఎఫ్ఆర్‌టీసీ మెడికల్ ఆఫీసర్ వేధింపులే కారణమని తప్పుడు ఆరోపణలు చేయడాన్ని ఖండిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పి.రవికుమార్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఆర్ పవన్‌కుమార్ స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్ర వారం వారు కలెక్టర్‌ను కలిసి ఈ విషయంలో సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సదరు మెడికల్ ఆఫీసర్‌ను కలిసి తాము విచారించామని, రాధాకృష్ణ తనపట్ల అసభ్యకరంగా ప్రవర్తించగా ఆ విషయాన్ని డీఎంహెచ్‌వో, ఆర్‌డీలు దృష్టికి తెచ్చానని తెలిపారన్నారు. దీనిపై విచారణ అధికారి విచారణచేసి డీఎంహెచ్‌వో, ఆర్‌డీలకు నివేదిక సమర్పించినట్లు వివరించారన్నారు. ఇది జరిగిన తర్వాత రాధాకృష్ణ కనిపించకపోవడంతో దాన్ని ఆసరాగా చేసుకుని తిరిగి బాధితురాలైన వైద్యాధికారిణిపై ఆరోపణలు చేస్తుండడంతో ఆమె ఒత్తిడికి గురవుతున్నారన్నారు. కానీ వాస్తవానికి ఇబ్బంది పడింది ఆ మహిళా వైద్యాధికారిణే అన్నారు. ఆమెకు జరిగిన అన్యాయానికి న్యాయం జరగకపోగా తిరిగి ఆమెపై నిందలు మోపుతున్నారన్నారు. ఒక మహిళా అధికారికి పనిచేసే స్థలంలో సరైన భద్రత లేకపోవడంతో మిగిలిన మహిళా అధికారులకు అభద్రతాభావం కలుగుతోందన్నారు. దీన్ని తమ అసోసి యేషన్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్, డీఎంహెచ్‌వో లను కలిసి సమగ్ర విచారణ జరిపి తగు న్యాయం చేయాలని కోరామన్నారు. దీనిపై కలెక్టర్, డీఎంహెచ్‌వో సానుకూలంగా స్పందించారని ఏపీపీహెచ్‌సీడీఏ అధ్యక్షుడు డాక్టర్ రవికుమార్, ప్రధాన కార్యదర్శి పవన్‌కుమార్ తెలిపారు.

హత్యకేసులో తండ్రితో సహా

కుమారులకు యావజ్జీవ శిక్ష

ద్రాక్షారామ, జూలై 26 : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా రామచంద్రపురం మండలం యనమదలలో సాదె జనార్ధనరావు హత్యకేసులో అదే గ్రామానికి చెందిన దారా అప్పారావు అతని కుమారులు దారా సింహాద్రి, దారా చంటి, దారా రాజశేఖర్‌లకు యావజ్జీవ కారాగార శిక్ష రూ.5వేలు చొప్పున జరిమానా విధిస్తూ జిల్లా అదనపు సెషన్స్ జడ్జి ఆర్.శ్రీలత శుక్రవారం తీర్పు చెప్పారు. ద్రాక్షారామ ఎస్ఐ జి.సురేంద్ర తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యనమదల గ్రామానికి చెందిన దారా అప్పారావుకు చెందిన పాడె గేదెలు సాదె జనార్ధనరావుకు చెందిన భూమి సరిహద్దులోకి వెళ్లి మొక్కలు పాడుచేస్తున్న విషయమై ఇరువురికి గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో 2015 సెప్టెంబరు 6న మధ్యాహ్నం 2 గంటలకు సాదె జనార్ధనరావుకు చెందిన స్థలంలోకి దారా అప్పారావు అతని కుమారులు దారా సింహాద్రి, దారాచంటి, దారా రాజశేఖర్‌లు కత్తులు, కర్రలతో అక్రమంగా ప్రవేశించి సరిహద్దులో కర్రల దడిపాడు చేసి సాదె జనర్ధానరావుకు చెందిన చింతచెట్టును నరికి పాడు చేస్తుండగా సాదె జనార్ధనరావు అతని కుమారులు వెళ్లి దౌర్జన్యంపై ప్రశ్నించగా దారా సింహాద్రి కత్తితో సాదె జనార్ధనరావును మెడ వెనుక చావరా అంటూ నరికాడు. దీంతో సాదె జనార్ధనరావు రక్తపు మడుగులో అక్కడికక్కడే మృతి చెందాడు. సాదె జనార్ధనరావు రెండవ కుమారుడు దుర్గాప్రసాద్ ద్రాక్షారామ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్ఐ కె.వంశీధర్ కేసు నమోదు చేయగా సీఐ పి.కాశీవిశ్వనాధం కేసు దర్యాప్తుచేసి సాక్ష్యాధారాలతో చార్జిషీటు దాఖలు చేశారు. రాజమహేంద్రవరం 10వ ఏడీజే ఎస్సీ, ఎస్టీ కోర్టు లో స్పీడ్ ట్రయల్ నిర్వహించగా నేరం రుజువు కావడంతో నింది తులు నలుగురికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.5వేలు చొప్పన జరిమానా విధిస్తూ జిల్లా అదనపు సెషన్స్ జడ్జి తీర్పునిచ్చారు. ఈ కేసులో కేసు నమోదుచేసిన ఎస్ఐ వంశీధర్, సీఐ పి.కాశీవిశ్వనాధరావు, స్పీడ్ ట్రయల్ నందు కృషి చేసిన ఎస్ఐ జి.సురేంద్రను ఎస్పీ బి.కృష్ణారావు అభినందించారు.

విద్యుత్ సిబ్బంది సాహసం

● ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించిన రామయ్య


రోప్ సహాయంతో రిస్క్ చేసి కాలువ దాటుతున్న విద్యుత్ సిబ్బంది

రాజమహేంద్రవరం సిటీ, జూలై 26 : ఇటీవల కురిసిన వర్షాలకు వాగులు వంకలు పొంగిపోర్లుతున్నాయి. మారుమూల గిరిజన ప్రాంతాలలో విద్యుత్ సమస్యలను పరిష్కరించడానికి రాజమహేంద్రవరం సర్కిల్ పరిధిలోని విద్యుత్ సిబ్బంది సాహసోపేతంగా ప్రాణాలకు తెగించి విధులు నిర్వహిస్తున్నారు. రంపచోడవరం డివిజన్‌కు చెందిన మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో బుధ వారం సున్నంపాడు గ్రామానికి విద్యుత్ సిబ్బంది వెళ్లి ఫీడర్ లైన్‌పై వెదురు బొంగులు ఇతర చెట్లు పడిపోవడంతో అక్కడ ఆగిపోయిన విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. సుమారు 800 మందిజనాభా కలిగిన సున్నంపాడు, దేవరపల్లి గ్రామాలకు కాలువను తమ జెఎల్ఎమ్ కూర రామయ్య విద్యుత్ కండక్టర్ సహాయంతో దాటి విద్యుత్ సరఫరాను అందించినట్లు ఏపీ ఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం సర్కిల్ ఎస్ఈ టీవీఎస్ మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా రామయ్యను ఎస్ఈ అభినందించారు. సహకరించిన గ్రామస్తులకు ధన్య వాదలు తెలిపారు.

మహిళపై గొడ్డలితో దాడి

● తీవ్రంగా గాయపడ్డ మహిళ
● సరిహద్దు గోడ వివాదమే కారణమా


తీవ్రంగా గాయపడిన మహిళ, ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

గొల్లప్రోలు, జూలై 26: పాతకక్షలను దృష్టిలో పెట్టుకుని ఇంటి పక్కనే ఉంటున్న మహిళపై ఒక వ్యక్తి గొడ్డలితో విచక్షణారహితంగా దాడిచేసి తీవ్రంగా గాయపరిచాడు. అనంతరం ఆమెను చికిత్స నిమిత్తం తొలుత పిఠాపురం, అక్కడి నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణంలోని రంగప్పచెరువు వీధిలో వాటర్‌ట్యాంకు ఎదురుగా నేకూరి రాజ్యలక్ష్మి తన భర్త, కుమారులతో కలిసి అద్దె ఇంటిలో నివాసముంటున్నది. వీరికి సమీ పాన వేమగిరి రాజేష్ అతని తల్లితో కలిసి ఉంటున్నాడు. వాళ్లింటిని ఎడమవైపున రాజ్యలక్ష్మి కుటుంబానికి ఖాళీస్థలం ఉంది. ఈ స్థలం లోకి వచ్చి గోడ కట్టుకున్నారంటూ రాజేష్‌కు, రాజ్యలక్ష్మి కుటుంబానికి మధ్య వివాదం కొంతకాలంగా ఉంది. ఈ విషయంలో పెద్ద మనుషుల్లో పెట్టగా గోడను సరిచేసుకోవాలని వారు రాజేష్‌కు సూచించారు. దీంతో రాజేష్ కక్ష పెంచుకుని అప్పటి నుంచి అవకాశం కోసం ఎదురు చూస్తున్నాడు. భర్త వ్యవసాయ పనులకు వెళ్లి రాజ్యలక్ష్మి ఇంటి వద్ద బయట టీ పెట్టుకుంటున్నది. దీనిని గమనించి రాజేష్ తన తల్లి లక్ష్మీతో ఆమె వద్దకు వెళ్లి ఆకస్మాత్తుగా గొడ్డలితో తలపై, శరీరంపై పలుచోట్ల విచక్షణా రహితంగా నరికాడు. దీంతో తీవ్రంగా గాయపడి రక్తపుమడుగులో ఉన్న ఆమెను తొలుత పిఠాపురం అక్కడి నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కాగా రాజేష్ ఇదే తరహాలో నాలుగేళ్ల క్రితం తన మేనమామ ద్రాక్షారపు భూషణంపై దాడి చేయగా దీనిపై కేసు నమోదైంది. మహిళపై గొడ్డలితో దాడిచేసిన సంఘటన పట్టణంలో సంచలనం కలిగించింది. పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ జాన్‌బాషాలు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితురాలి నుంచి వివరాలు సేకరించారు. గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా రాత్రి రాజేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


దొంగ రవిదుర్గాగణేష్

అమలాపురంరూరల్, జూలై 26: స్నేహితులిద్దరూ పని ముగించుకుని ఇంటికి వెళుతుండగా రోడ్డు బెర్మ్‌లో మోటారు సైకిల్ అదుపు తప్పి బోల్తా కొట్టడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందగా మరొకరు తీవ్ర గాయాలతో అమలాపురం ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పట్టణ సీఐ కె.క్రిస్టఫర్, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీ మ జిల్లా అమలాపురంరూరల్ పేరూరు తోట్లపాలేనికి చెందిన దొంగ రవిదుర్గాగణేష్ (26) తాపీ పనిచేస్తుండగా స్నేహితుడైన గెద్దాడ ఓంసాయి ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం పని ముగించుకుని మోటారు సైకిల్‌పై ఇంటికి వస్తుండగా ఒక్కసారిగా మోటారు సైకిల్ అదుపుతప్పి బోల్తా కొట్టడంతోదుర్గాగణేష్ తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఓంసాయి తీవ్ర గాయాలపాలు కాగా స్థానికులు హుటాహుటిన ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు శవపంచనామా పూర్తిచేసి దుర్గాగణేష్ మృతదేహాన్ని అమలాపురం ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడి తండ్రి సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ క్రిస్టఫర్ తెలిపారు. మృతుడికి తల్లి శ్యామల, తండ్రి సత్యనారాయణతో పాటు సోదరుడు ఉన్నారు. తల్లిదండ్రులతో పాటు దుర్గాగణేష్ ఏరోజుకారోజు కూలి పనులు చేసుకుని కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. చేతికందిన కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు అందరినీ కంటతడి పెట్టించింది.

స్వదేశానికి వీరేంద్రకుమార్

● మంత్రి నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపిన వీరేంద్ర


హైదరాబాద్‌లోని కుటుంబ సభ్యులతో వీరేంద్రకుమార్

అంబాజీపేట, జూలై 26: ఏజెంట్ మోసంతో సౌదీలో చిక్కుకుని నరక యాతన పడిన సరెళ్ల వీరేంద్రకుమార్ మంత్రి నారా లోకేశ్ కృషితో స్వదేశానికి చేరుకున్నాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం ఇసుకపూడి గ్రామానికి చెందిన వీరేంద్రకుమార్ సౌదీలో ఒంటెల కాపరిగా ఉండి తాను పడుతున్న ఇబ్బందులను సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వానికి తెలియజేసినవిషయం విదితమే. ఈమేరకు మంత్రి నారా లోకేశ్ స్పందించి అక్కడి టీడీపీ ఎన్ఆర్ఐలు, జిల్లా కలెక్టర్, అధికారులు ఏంబీసీతో మాట్లాడి స్వదేశానికి తీసుకువచ్చారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు వీరేంద్ర హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో దిగాడు. అక్కడ కుటుంబ సభ్యులతో కాసేపు ముచ్చటించి హైదరాబాద్‌లో ఉన్న బంధువుల ఇంటికి చేరుకున్నాడు. అక్కడ వైద్య పరీక్షలు చేయించుకుని స్వగ్రామానికి చేరుకుంటానని వీరేంద్ర తెలిపారు. తనని స్వదేశానికి తీసుకువచ్చిన ఆంధ్రప్రదేశ్ కూటమి, ప్రభుత్వానికి, మంత్రి నారా లోకేశ్‌కు వీరేంద్ర కృతజ్ఞతలు తెలిపారు.

ప్రియుడి వేధింపులు తాళలేక గర్భిణి ఆత్మహత్య

నల్లజర్ల, జూలై 26: ప్రియుడి వేధింపులు తాళలేక మూడు నెలల గర్భిణీ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని పోతవరంలో జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. పోతవరం గ్రామానికి చెందిన బాకీ వెంకట్రావు, నాగలక్ష్మి దంపతుల ఏకైక కుమార్తె విజయదుర్గ(21) ఈ ఏడాది మార్చి నెల వరకు గ్రామంలో వలంటీర్‌గా పనిచేసింది. ఏప్రిల్ 3న ఏలూరు జిల్లా పూళ్ల గ్రామానికి చెందిన లక్ష్మణ్‌ఈశ్వర్‌తో వివాహం జరిగింది. ఆషాఢ మాసం కావడంతో విజయదుర్గ పుట్టింటికి పోతవరం వచ్చింది. అదే గ్రామానికి చెందిన ప్రియుడు సిమెంట్ పనులకు వెళ్లే దెబ్బెం ధనరాజు వేధింపులకు పాల్పడుతున్నాడు. విజయదుర్గ తనకు పెళ్లయిందని ఇంతటితో వదిలేయమని ప్రాధేయపడింది. అయినా పట్టించుకోకుండా పదే పదే వేధించడంతో హెచ్చరించింది. దీంతో ధనరాజు గతంలో తనతో సన్నిహితంగా ఉన్న ఫొటోలు, ఫోన్ సంభాషణ పూళ్లలో ఉంటున్న విజయదుర్గ భర్తకు పం పించాడు. దీంతో భర్త ఫోన్‌లో మందలించడంతో వారి మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. జీవితంపై విరక్తి చెందిన విజయదుర్గ బుధవారం ఇంట్లో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు వచ్చి ముందుగా నల్లజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఆపై మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది.

ప్రత్తిపాడులో


వైద్య ఉద్యోగి ఇంట్లో చోరీ

● రూ.7లక్షలు విలువైన బంగారు ఆభరణాలు, నగదు అపహరణ


చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న పెద్దాపురం డీఎస్పీ, ప్రత్తిపాడు సీఐల బృందం

ప్రత్తిపాడు, జూలై 26: కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో వైద్యఉద్యోగి ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనలో రూ.7లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలు, నగదు దొంగలు అపహరించారు. గురువారం సాయంత్రం జరిగిన ఈ చోరీ ఘటనకు సంబంధించి బాధితుల ఫిర్యాదుల మేరకు శుక్రవారం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ప్రత్తిపాడులోని ఫైర్‌స్టేషన్ సమీపంలో వైద్య ఉద్యోగి మచ్చికర్ల అప్పలస్వామి, భార్య సత్యకాంత ఇరువురు పిల్లలతో డాబా ఇంట్లో నివసిస్తున్నారు. దేవీపట్నం మండలం ఇందుకూరుపేట పీహెచ్‌సీలో మచ్చకర్ల అప్పలస్వామి ఫార్మశిస్టుగా పనిచేస్తున్నారు. గురువారం సాయంత్రం ఇంటివద్ద ఉన్న అతని భార్య సత్యకాంత స్థానిక బస్టాండ్ సమీపంలోని తన తల్లి నిర్వహిస్తున్న దుకాణం వద్దకు వెళ్లింది. అదే సమయంలో దుండగులు ఇంట్లోకి చొరబడి బీరువాలో భద్రపరిచిన రూ.3లక్షల నగదుతోపాటు రూ.4లక్షలు విలువచేసే 12రకాల బంగారు ఆభరణాలు చోరీకి పాల్పడ్డారు. డాబాపై ఫస్ట్‌ఫ్లోర్ నిర్మాణ పనులు ఒక వైపు జరుగుతున్నా కింది ఫ్లోర్‌లో తలుపులకు తాళాలు వేసినా దుండగులు చాకచక్యంగా లోపలకి వెళ్లి ఈ చోరీకి పాల్పడ్డారు. ఇందుకూరుపేట పీహెచ్‌సీ నుంచి అప్పల స్వామి ప్రత్తిపాడు చేరుకుని తన ఇంటిపై జరుగుతున్న నిర్మాణ పనులు పరిశీలించేందుకు వెళుతూ కిటికీలోంచి బెడ్‌రూంలోని వస్తువులు చిందరవందరగా ఉండటాన్ని గమనించి మెయిన్ డోర్ తాళాలు తీసి పరిశీలించగా చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బీరువాలో ఉన్న రూ.3లక్షల నగదుతో పాటు రూ.4లక్షలు విలువచేసే 20 కాసుల బంగారు నెమలి లాకెట్, రెండు రకాల నల్లపూసల తాళ్లు, రెండు రకాల చెవిదిద్దులు, బ్రాస్‌లెట్‌లు, చైన్‌లు, మూడు ఉంగరాలు, రెండు రూపులు, గ్రీన్‌స్టోన్ చెవిదిద్దులు తదితర వస్తువులు చోరీకి గురైనట్లు బాధితులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పట్టపగలు తమ ఇంట్లో మూసిన తలుపులు మూసినట్లు వేసిన తాళాలు వేసినట్లు ఉండగా దుండగులు ఏ విధంగా చోరీకి పాలపడ్డారో అర్థం కావడంలేదని బాధితులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని శుక్రవారం సాయంత్రం పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి, ప్రత్తిపాడు సీఐ శేఖర్‌బాబు, ప్రత్తిపాడు, ఏలేశ్వరం ఎస్ఐలు ఎం.పవన్‌కుమార్, జి.సతీష్‌లు సందర్శించారు.కాకినాడ నుంచి క్లూస్ టీం, వేలిముద్ర నిపుణులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. దీనిపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రధాని మన్ననలను పొందిన పెయింటింగ్


నరేంద్రమోదీ మనసు దోచిన హరి తాడోజు పెయింటింగ్ ఫొటో

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 26: ప్రధాని నరేంద్ర మోదీ తన ట్విట్టర్ ఖాతాలో పోస్టు చేసిన ప్రముఖ చిత్రకారుడు, స్ట్రోకర్స్ అధినేత హరి తాడోజు పెయింటింగ్ ప్రధాని మన్ననలు పొందింది. ఇటీవల ప్రధాని కన్యాకుమారిలో ధ్యానం చేస్తున్నట్లున్న చిత్రాన్ని మాజీ ప్రధాని హెచ్‌డీ దేవగౌడ.. హరి తాడోజుతో వేయించుకొని, తనను కలిసిన ప్రధాని నరేంద్ర మోదీకి పెయింటింగ్‌ని బహూకరించారు.. ఆ విషయాన్ని ప్రధాని మోదీ తనట్విట్టర్ ఖాతాలో పోస్టుచేశారని, ఈ విషయంతనకు ఎంతో సంతోషాన్ని చ్చిందని హరి తాడోజు తెలిపారు. ప్రధాని మనసు దోచిన ఈ పెయింటింగ్‌ను చూసి మిత్రులు హరి తాడోజుకు అశేషంగా అభినందనలు తెలుపుతున్నారు.

పోలవరం నిర్వాసితులను కాపాడండి

● తొలిసారి అసెంబ్లీలో గళం విప్పిన రంప ఎమ్మెల్యే మిరియాల శిరీష


అసెంబ్లీలో మాట్లాడుతున్న రంప ఎమ్మెల్యే శిరీషాదేవి

రంపచోడవరం/చింతూరు జులై26: పోలవరం ప్రాజెక్టు, గోదావరి వరదల మూలంగా ఇబ్బందులు పడుతున్న రంపచోడవరం నియోజకవర్గంలోని గోదావరి పరివాహక ప్రాంత ప్రజలను కాపాడాలని ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశాలు ముగిసిపోతున్న వేళ చివరిగా తనకు వచ్చిన కొద్దిపాటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆమె పలు సమస్యలను లేవనెత్తారు. నాలుగు విలీన మండలాల్లోని 130 ఆవాసాలలో 34 వేల కుటుంబాలు వరదల ప్రభావానికి గురయ్యారన్నారు. ఈ గ్రామాల్లో ఎక్కడా శాశ్వత వరద పునరావాస కేంద్రాలు లేకపోవడంతో వరదలు వచ్చిన ప్రతిసారీ కొండలపైనే తలదాచుకుంటున్నారన్నారు. గత 15 సంవత్సరాలుగా ఈ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో లేదని, 10 సంవత్సరాలుగా వైసీపీ అధికారంలో కొనసాగిందని, ఫలితంగా ఇక్కడి ప్రజలను పట్టించుకునే వారే లేరన్నారు. సరైన వరద సహాయం అందని పరిస్థితులను వైసీపీ పాలనలో ఎదుర్కొన్నామని, దోమ తెరలూ కూడా ఇవ్వలేదని అన్నారు. ఈ వరదల్లో కలెక్టరు ఏర్పాట్లు చేసినా నిత్యావసర వస్తువులు అందుబాటులో లేని పరిస్థితులు ఉన్నాయన్నారు. అక్కడి ప్రజలకు హామీ ఇచ్చి తాను అసెంబ్లీలో అడుగుపెట్టానని, అనేక సమస్యలతో తన నియోజకవర్గం ఉన్నదన్నారు. పోలవరం కింద నిర్వాసితులకు సురక్షిత ప్రాంతాలలో వారు కోరుకున్న చోట పునరావాస కాలనీలను నిర్మించాలని కోరారు. పోలవరం తమకు వరమా లేక శాపమా అని ఈ నాలుగు విలీన మండలాల ప్రజలూ భావిస్తున్నారన్నారు. ఇక జీ.ఓ.నెం.3 పునరుద్ధరణ అవసరాన్ని కూడా ఆమె ప్రస్తావించారు. ప్రభుత్వం చేపట్టబోయే మెగా డీఎస్సీలో జీవో నెం.3లోని ఫలాలు అందేలా చూడాలని కోరారు.

పందుల పందేలపై దాడి.. ఐదుగురి అరెస్టు

ముమ్మిడివరం, జూలై 26: కొత్తలంక శివారు పచ్చమట్లవారిపాలెంలో పందుల పందేలు నిర్వహిస్తున్న శిబిరంపై పోలీసులు దాడిచేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. పచ్చమట్లవారిపాలెం కొబ్బరితోటలో శుక్రవారం పందుల పందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో ముమ్మిడివరం ఎస్ఐ డి.సురేష్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మికంగా దాడిచేసి ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.1800 నగదు స్వాధీనం చేసుకున్నారు. సంఘటనా స్థలంలో 7 మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టుచేసి కోర్టుకు హాజరుపరిచినట్టు ఎస్ఐ తెలిపారు.

ఏజెన్సీ సమాచారం

ముంపు ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలి

● మండలంలో మూడోరోజు జేసీ పర్యటన



మురుమూరులో గ్రామస్తులతో మాట్లాడుతున్న జేసీ

ఎటపాక, జూలై 26: గోదావరి వరద ముంపుకు గురైన ప్రాంతాల్లో పారిశుధ్య లోపం లేకుండా సత్వర చర్యలు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే అభిషేక్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం జేసీ ఎటపాక మండలంలోని గౌరీదేవిపేట, నంది గామ, మురుమూల గ్రామాల్లో పర్యటించారు. పునరావాస కేంద్రాలతోపాటు వరద ముంపునకు గురైన గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి, పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేయాలని వైద్య ఆరోగ్య అధికారులను ఆదేశించారు. వర్షాలు, వరదలతో దెబ్బతిన్న రహదారుల వివరాల నివేదికను తయారుచేసి, పంపాలని అధికారులను ఆదేశించారు. వరద బాధితులకు పునరావాస కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని, గోదావరి వరద, వర్షాలు తగ్గిన తర్వాత పంట నష్టం అంచనాల వివరాలు సేకరించేందుకు సర్వే నిర్వహిస్తామని చెప్పారు. వైఎస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు, పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యవసర సరుకులు పంపిణీ

ఎటపాక మండలం, నెల్లిపాక గ్రామంలో పొట్టకూటి కోసం వచ్చి ఇటుక బట్టీలో కూలీలుగా పనిచేస్తున్న 10 కుటుంబాల వారికి శుక్రవారం స్థానిక టీడీపీ నాయకులు కిలారు వెంకన్న, నలజాల శ్రీకాంత్‌చౌదరి నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. గత మూడురోజుల క్రితం సంభవించిన గోదావరి వరదలకు ఇటుక బట్టీ కూలీలు తాత్కాలిక ఇళ్లు ముంపుకు గురయ్యాయి. దాంతో ఈ కుటుంబాల వారికి బియ్యం, నిత్యావసరాలు, కూరగాయలను అందించారు.

వ్యాధులు ప్రభలకుండా అప్రమత్తంగా ఉండాలి

మోతుగూడెం, జూలై 26: చింతూరు మండలం మోతుగూడెంలో సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని మోతుగూడెం ప్రాథమిక వైద్యాధికారి ప్రజ్ఞ సూచించారు. గ్రామాల్లో ప్రాథమిక వైద్యాధికారి ప్రజ్ఞ, ఏఎన్‌ఎం సర్వే నిర్వహించారు. మోతుగూడెం, పొల్లూరు, ఫోర్‌బై సీడీ క్యాంప్ వైద్య శిబిరాలు నిర్వహించారు. జోరువానలో సైతం సిబ్బందితో ఇంటింటినీ సందర్శించి గ్రామస్థులతో మాట్లాడి వారి ఆరోగ్యం వివరాలు అడిగి వైద్యం అందజేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

దేవీపట్నం, జూలై 26: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి అన్నారు. శుక్రవారం మండలంలోని ఇందుకూరు 1 అగ్రహారం, ఏనుగులగూడెం గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ, ఆరోగ్య సిబ్బంది వీరయమ్మ ఇంటింటికి వెళ్లి ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది నాగమణి, సూరమ్మ, భవానీ, పార్వతి పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన టీడీపీ ఎంపీటీసీ

మోతుగూడెం, జూలై 26: వై.రామవరం మండ లం బొడ్డగండి పంచాయతీ-2 డొంకరాయి ఎంపీటీసీ కరక వెంకటరమణ వరద పర్యవేక్షణలో ఉన్న కలెక్టర్ దినేష్‌కుమార్‌ను చింతూరు ఐటీడీఏ పీవో బంగ్లాలో మర్యాదపూర్వకంగా కలిశారు. రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్‌గా పనిచేసిన దినేష్‌కుమార్ మరలా జిల్లాకు కలెక్టర్‌గా రావడం చాలా సంతోషకరమన్నారు. ఆ సందర్భంగా శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ బొడ్డంగి గ్రామ పంచాయతీల పరిధిలో పలు సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారి రంపచోడవరం ఐటీడీఏ పీవోకి కలెక్టర్ రిఫర్ చేశారు.

960 గ్రాముల బరువుతో శిశువు

● ఆసుపత్రికి తరలించిన వైద్యులు



రాజవొమ్మంగి జూలై 26: రాజవొమ్మంగి గ్రామంలో 960గ్రాముల బరువు ఉన్న శిశువును గుర్తించి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి శుక్రవారం వైద్యులు తరలించారు. రాజవొమ్మంగి వైద్యాధికారిని సుష్మ తెలిపిన వివరాల ప్రకారం స్థానిక కన్నయమ్మపేటకు చెందిన పప్పుల దివ్య గతనెల 29న 7వ నెలలోనే కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో కవల పిల్లలకు(ఇద్దరు ఆడపిల్లలు) జన్మనిచ్చింది. అక్కడే 18రోజులు ఉండి ఇంటికి వచ్చారు. శిశువులలో ఒకరు కేవలం 960 గ్రాముల బరువు, మరొకరు 1260గ్రాముల బరువుతో పుట్టడంతో రంపచోడవరం ఏడీఎంహెచ్‌వో శిరీష గురువారం రాజవొమ్మంగి గ్రామంలోని తల్లి,పిల్లలను చూసి కాకినాడ వెళ్లాల్సిందిగా సూచించారు. ఆమె ఆదేశాల మేరకు రాజవొమ్మంగి వైద్యాధికారి సుష్మ తల్లి,పిల్లలను సూపర్‌వైజర్ లక్ష్మమ్మ, ఆశావర్కర్ చెల్లయమ్మలను కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు.

పేదరికంతో ఇంటికి..!

పప్పుల దివ్య గత నెల 29న కవల పిల్లలకు జన్మనిచ్చిన అనంతరం వారు ఇరువురు అతి తక్కువ బరువుతో పుట్టడంతో వారిని కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో ఉంచి వైద్యం పొందాలని కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు సూచించినప్పటికీ 18రోజుల తరువాత రాజవొమ్మంగి వచ్చేశారు. కారణం ఏంటని స్థానిక వైద్య సిబ్బంది ఆరా తీస్తే, కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో ఉండే సమయంలో రోజూ బయట ఖర్చులు తట్టుకోలేక వచ్చేసామని, తన భర్త బాబురావు కూలికి వెళితే తప్ప ఆ రోజు జీవనం గడవదని వైద్య సిబ్బంది వద్ద దివ్య కన్నీటిపర్యంతమైంది. దీంతో రాజవొమ్మంగి వైద్యాధికారి సుష్మ చొరవతో శుక్రవారం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లారు. కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో ఖర్చులకు కొంత మేర సొమ్ము, ఆ కుటుంబం కూడా రెండు రోజులకు ఒక ఆశ వర్కర్ ఉండేలా వైద్యాధికారి సుష్మ ఏర్పాట్లు చేసినట్లు స్థానికులు తెలిపారు.

నీటి నిల్వలు నివారించుకోవాలి

వై.రామవరం, జూలై26: ప్రజలు వ్యాధుల బారిన పడకుండా దోమల నిర్మూలనలకు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో కె.బాపన్నదొర పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి సూచించారు. శుక్రవారం ప్రత్యేక పారిశుధ్య నివారణ చర్యలపై పలు పంచాయతీల్లో ఆయా సిబ్బందికి సూచనలు చేశారు. అన్ని పంచాయతీల్లో అన్ని శాఖల సిబ్బంది ఈచర్యలు చేపట్టాలన్నారు. యర్రంరెడ్డిపాలెం, కోట, దాలిపాడు, చవిటిదిబ్బలు, వై.రామవరం, పనసలపాలెం, పి.యర్రగొండ తదితర 17పంచాయతీల్లోను సిబ్బంది ఆయా కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. ప్రతీ ఒక్కరూ వర్షాకాలంలో తగు జాగ్రత్తలు పాటించాలన్నారు.

రైతులకు యూరియా పంపిణీ

అడ్డతీగల, జూలై26: అడ్డతీగల మండలం గొండోలు పంచాయతీ పరిధిలోని గ్రామాలలో అర్హులైన గిరిజన రైతులకు మండల టీడీపీ అధ్యక్షుడు జర్తా వెంకటరమణారెడ్డి రైతులకు యూరియా పంపిణీ చేశారు. కార్యమంలో స్థానిక నాయకులు తోకల సత్తిబాబు, కామన.కృష్ణమూర్తి, చదువు. రామకృష్ణ, వరలక్ష్మీ,రాఘవ జనసేన నాయ కులు గోపి,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు దోమతెరలు, టార్పాలిన్లు పంపిణీ



వరద బాధితులకు దోమతెరలు అందిస్తున్న దృశ్యం

వరరామచంద్రాపురం, జూలై 26: ఆపదలో మేమున్నామంటూ వరద బాధితులను తమవంతుగా ఆదుకునేందుకు రోటరీక్లబ్ యాజమాన్యం ముందుకు వచ్చింది. వీ ఆర్‌పురం ఎంపీడీవో చొరవతో వెంటనే స్పందించిన రోటరీక్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ హైదరాబాద్ ఇన్‌కమింగ్ గవర్నర్ రాంప్రసాద్, రోటరీక్లబ్ ఆఫ్ తాడేపల్లి ప్రెసిడెంట్ రమేష్‌బాబు, సెక్రటరీ సుకుమార్‌రెడ్డి, మంగళగిరి, తెనాలి రోటరీక్లబ్ ప్రెసిడెంట్‌లు గాజుల శ్రీనివాస్, ఈదర శ్రీనివాస్, సెక్రటరీ పూర్ణచంద్‌లు ముందుకు వచ్చి మూడు లక్షలు విలువచేసే టార్పాలిన్స్, దోమ తెరలు మండలంలోని గోదావరి పరివాహక ప్రాంతాలలో నీటమునిగిన గ్రామాలలోని 1000 గిరిజన కొండరెడ్ల కుటుంబాలకు నాటుపడవల ద్వారా ఆ గ్రామాలకు వెళ్లి వరద బాధిత కుటుంబాలకు పంపిణీ చేశారు.

తామరపల్లిలో గ్రామసభ

రంపచోడవరం, జూలై 26: మండలంలోని తామరపల్లి పంచాయితీలో సర్పంచ్ మిర్తివాడ ఆనంద్‌రెడ్డి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ వంశీ కుంజం మాట్లాడుతూ కోళ్లు, ఆవుల షెడ్లు నిర్మించుకొనేందుకు పశుసంవర్ధకశాఖ ద్వారా రాయితీలు, కౌలుకార్డుల ద్వారా పొందే లాభాలు, పంటల భీమా, పంటల గిట్టుబాటు ధరలపై అవగాహన కల్పించారు. ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో మురుగు నీటి కుంటలు నిల్వ లేకుండా చూడాలన్నారు. ఇంటి పన్నులలో పేరు మార్పులపై దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి భారతి, వీఆర్వో డీవీవీ సత్యనారాయణ, అగ్రికల్చర్ అసిస్టెంట్ పి.భాష్కర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులందరికీ 'తల్లికి వందనం'

రాజమహేంద్రవరం సిటీ, జూలై 26: ఎన్నికల హామీలను టీడీపీ అధినేత చంద్రబాబు నిలబెట్టుకున్నారని పార్టీ శెట్టిబలిజ సాధికార కమిటి రాష్ట్ర కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు శుక్రవారం ఓ ప్రకటనలో అన్నారు. తల్లికి వందనం పథకంలో భాగంగా ఇంట్లో చదువుకునే పిల్లలు ఎంతమంది వుంటే అంతమందికి రూ.15 వేలు చొప్పున ఇస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకునేందుకు చంద్రబాబు విధివిధానాలు రూపొందిస్తున్నారని, త్వరలో ఈ పథకం అమలు చేస్తారని చెప్పారు.

వీర జవాన్లను స్మరించుకోవాలి

- ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి
- ఘనంగా కార్గిల్ విజయ దివాస్.. అమరువీరులకు ఘన నివాళి

అనపర్తి, జూలై 26: దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వీర జవాన్లను స్మరించుకోవాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. కార్గిల్ విజయ్ దివాస్ ర్యాలీని శుక్రవారం అనపర్తిలో బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నల్లమిల్లి ముందుగా స్థానిక గాంధీ బొమ్మ సెంటర్‌లో గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం దేవీచౌక్ వరకు ర్యాలీ కొనసాగింది. కూటమి నాయకులు కార్యకర్తలు కాగడాలు, కొవ్వొత్తులతో ర్యాలీలో పాల్గొని అమరవీరులకు నివాళులర్పించారు. కార్గిల్ రక్షణ కోసం సుమారు 500మంది జవాన్లు ప్రాణ త్యాగం చేసి ఆ భూ భాగాన్ని దేశానికి అందించిన వీర జవాన్లకు ప్రతి పౌరుడు రుణపడి ఉండాలని నల్లమిల్లి అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి శివరామకృష్ణంరాజు, నాయకులు సిరపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, మల్లిడి శ్రీనివాసరెడ్డి, కొవ్వూరి వెంకటరామారెడ్డి, తాడి గంగిరెడ్డి చింతా సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.



అనపర్తిలో నిర్వహిస్తున్న ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే నల్లమిల్లి

రాజానగరం: కలవచర్లలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ పిల్లా రాజు అధ్యక్షతన జరిగిన కార్గిల్ విజయ దివాస్ కార్యక్రమానికి బీజేపీ రాజానగరం అసెంబ్లీ కో కన్వీనర్ అడబాల గణపతిరావు విచ్చేసి మాట్లాడారు. ప్రతికూల పరిస్థితుల్లో కూడా యుద్ధం చేసి కార్గిల్ యుద్ధంలో అమరులైన వీరసైనికుల త్యాగాలను స్మరించుకోవడం మనందరి కర్తవ్యమని అన్నారు. ప్రతి విద్యార్థి కార్గిల్ వీరసైనికులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వారి ఆత్మశాంతి కోసం సమావేశంలో కొద్దిసేపు మౌనం పాటించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కేఎస్‌ఆర్‌ఎస్‌ఎన్ రత్నగిరి, బీజేపీ మండలాధ్యక్షుడు ఆళ్ల శివనాగరాజు, ఉల్లి శివ, సానా కృష్ణార్జునుడు, చల్లా ప్రసాద్, పిల్లా సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కడియం: కడియపులంక ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్గిల్ విజయ్ దివాస్ కార్యక్రమంలో బీజేపీ నేతలు ఒంటెద్దు స్వామి, కొటికలపూడి వెంకటేశ్వరరావు, బొర్సు సుబ్రహ్మణ్యం, చిక్కాల శ్రీనివాస్, నాగులపల్లి వీరబాబు పాల్గొన్నారు. భారతదేశం పాకిస్తాన్‌పై విజయం సాధించి 25 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా దేశ కీర్తి ప్రతిష్టలు, భద్రతకు సైనికుల త్యాగం మరువలేనిదని పలువురు ప్రశంసించారు. మాజీ సైనికుడు గంగుల సుబ్రహ్మణ్యంను ఘనంగా సత్కరించారు.



కడియంలో మాజీ సైనికుడు సుబ్రహ్మణ్యంను సత్కరిస్తున్న దృశ్యం

వైసీపీ అనాలోచిత చర్యలతో రోడ్లు అధ్వానం

ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి/రంగంపేట జూలై 26: గత ప్రభుత్వ అనాలోచిత చర్యల వల్లే రోడ్లు అధ్వానంగా తయారయ్యాయని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం రంగంపేట ఏడీబీ రోడ్డు, సింగంపల్లి రోడ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిచిపోయాయని, ఐదేళ్ల పాటు ప్రయాణికులు నరకయాతన పడ్డారని అన్నారు. పరిస్థితిని గమనించిన సీఎం చంద్రబాబు కాంట్రాక్టర్లకు ఇవ్వవలసిన బకాయిల్లో కొంతమేర వెసులుబాటు కల్పించడంతో పనులు ప్రారంభమయ్యాయన్నారు. వర్షాల కారణంగా పనులు మందకొడిగా సాగుతున్నాయని ప్రస్తుతం ఏడీబీ రోడ్డులో ప్రయాణీకులకు ఇబ్బందులు లేకుండా మరమ్మతులు నిర్వహిస్తున్నామన్నారు. వాతావరణం అనుకూలిస్తే పనులు వేగవంతమౌతాయని అన్నారు. ఎమ్మెల్యే వెంట నాయకులు ఆళ్ళ గోవిందు, వెలుగుబంటి సత్యనారాయణ, రోడ్లు భవనాల శాఖాధికారులు తదితరులున్నారు.

జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు

కడియం, జూలై 26: కడియంలో శుక్రవారం జనసేన గ్రామకమిటీ ఆధ్వర్యంలో క్రియాశీలక సభ్యత్వనమోదు కార్యక్రమం జరిగింది. దీనికి పార్టీ మండలాధ్యక్షుడు ముద్రగడ వీరేష్(జమీ) విచ్చేసి మాట్లాడుతూ గ్రామగ్రామాన సభ్యత్వ నమోదు జరుగుతుందన్నారు. మరో మూడు రోజులు మాత్రమే గడువు ఉందన్నారు. కార్యక్రమంలో గట్టి నర్సయ్య, పంతం గణపతి, ఆదిమూలం సాయిబాబా, నాగిరెడ్డి రామకృష్ణ, చిలుకూరి నాగేశ్వరరావు గ్రీన్‌లాండ్ బాబి, ఉండమట్ల ప్రభాకర్ పాల్గొన్నారు.

హాస్టళ్లలో పూర్తి సదుపాయాలు కల్పించండి

ప్రభుత్వానికి ఎస్సీఎస్టీ ఉద్యోగుల సంఘం వినతి

రాజమహేంద్రవరం సిటీ, జూలై 26: రాజమహేంద్రవరంలోని ఎస్సీ, ఎస్టీ వసతి గృహాల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కూటమి ప్రభుత్వానికి ఎస్సీఎస్టీ ఉద్యోగుల సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం స్థానిక సుబ్బారావుపేటలోని ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహంలో వంటశాలకు ఇడ్లీపాత్ర తదితర వస్తువులను అందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు కోరుకొండ చిరంజీవి, ఎల్ఐసీ ఆఫీసర్స్ ఎస్పీ శ్రీనివాస్ మాట్లాడారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరు కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని విద్యావంతులు కావాలని ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తాళ్ళూరి బాబు రాజేంద్రప్రసాద్, తాడి రామారావు, కోరుకొండ మురళీకృష్ణ, హాస్టల్ అధికారి రాజేష్ పాల్గొన్నారు.

నేడు తాగునీటి సరఫరా నిలిపివేత

రాజమహేంద్రవరం సిటీ, జూలై 26: రాజమహేంద్రవరంలో పలు ప్రాంతాలకు శనివారం ఉదయం తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్టు నగరపాలక సంస్థ ఎస్ఈ జి.పాండురంగారావు శుక్రవారం సాయంత్రం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలో 1,2,3,4,5,6,7,8,,9,10,11,37,42,43,44,50 డివిజన్లకు తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. సుబ్బారావుపేట, నెహ్రూనగర్, సైక్లోన్ కాలనీ, అద్దెపల్లి కాలనీ, బాబానగర్, వెంకట్రామయ్యనగర్, నారాయణపురం, శారదనగర్, ప్రశాశ్‌నగర్, కోకా భాస్కరమ్మనగర్, బత్తిన నగర్, తారకరామయ్యనగర్, వీరభద్రపురం, లలితానగర్, మునిసిపల్ కాలనీ, ఆర్‌వి నగర్, విద్యానగర్, సువిశేషపురం, మల్లికార్జున నగర్, వీవర్స్‌కాలనీ, సంజీవనగర్, ఇందిర సత్యనగర్ పుంత, పిఅండ్‌టీ కాలనీ పార్టు, చౌడేశ్వర నగర్, రెవెన్యుకాలనీ, ఎస్‌బీఐ నగర్, భాస్కర్‌నగర్, గాంధీపురం-4 ప్రాంతాలకు శుక్రవారం సాయంత్రం తాగునీటి సరఫరా నిలివేశామని శనివారం ఉదయం పూట కూడా తాగునీటి సరపరా ఉండదని చెప్పారు. ప్రధాన మంచినీటి పైపులైన్ మరమ్మతుల నిమిత్తం ఈ అంతరాయం కలుగుతుందని, ప్రజలు సహకరించాలని కోరారు. ఆయా ప్రాంతాలకు వాటర్ ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా చేస్తున్నట్టు తెలిపారు.

పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రం

రేవులు, పునరావాస కేంద్రాలు తనిఖీలో కమిషనర్ కేతన్ గార్గ్



రాజమహేంద్రవరం సిటీ, జూలై 26: రాజమహేంద్రవరంలో ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రం చేయడం, పాగింగ్ చేయడం వంటి పనులు పక్కాగా చేయిస్తున్నామని మునిసిపల్ కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. శుక్రవారం ఆయన రాజమహేంద్రవరంలో గోదావరి స్నానాల రేవులను, వరద బాధితుల పునరావాస కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గోదావరి స్నానాల రేవులను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఎటువంటి ఇన్‌ఫెక్షన్స్ సోకకుండా బ్లీచింగ్ పౌడరు చల్లడం వంటివి చేయిస్తున్నామన్నారు. నగరంలో ఆల్కాట్ గార్డెన్స్ నగరపాలక సంస్థ కళ్యాణ మండపంలో ఉన్న 250 మందికి, చందాసత్రంలో ఉన్న 198 మందికి అల్పాహారం, భోజనం, సాయంత్రం స్నాక్స్ అందిస్తున్నామన్నారు. అందుబాటులో వైద్యశిబిరం కూడా ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, ఎస్ఈ జి.పాండురంగారావు, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న పాల్గొన్నారు.

భర్త వివాహేతర సంబంధాన్ని పట్టించిన భార్య

నల్లజర్ల, జూలై 26: మండలంలోని ప్రకాశరావుపాలెంలో భర్త అక్రమ సంబంధాన్ని పోలీసుల సహాయంతో అతడి భార్య రెడ్ హ్యాండెడ్‌గా పట్టించి పోలీస్‌స్టేషన్‌కు చేర్చింది. వివరాలిలా ఉన్నాయి. జొన్నకూటి రవికుమార్ ప్రకాశరావుపాలేనికి చెందిన మహిళను వివాహం చేసుకుని ఇక్కడే ఉంటూ లైటింగ్ పనులు చేస్తున్నాడు. వీరికి ముగ్గురు ఆడపిల్లలు. రవికుమార్ ఇటీవల చిన్నయల్లమిల్లికి చెందిన మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో పలుమార్లు భార్యాభర్తలు గొడవలు పడి పోలీస్‌స్టేషన్లకు వెళ్లారు. అయినప్పటికీ వివాహేతర బంధం వీడకపోవడంతో భర్త కదలికపై భార్య కన్నేసింది. శుక్రవారం తెల్లవారుజామున గ్రామం శివారు షెడ్‌లో ఉన్నట్టు మరో మహిళతో ద్వారా పక్కా సమాచారం తెలుసుకుంది. 100 నెంబరుకు ఫోన్‌చేసి పోలీసులు వచ్చే వరకు అక్కడే ఉండి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టించింది. దీంతో పోలీసులు ఇద్దరినీ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇరువర్గాలతో మాట్లాడుతున్నారు.

ప్రగడ కోటయ్య జయంతి




రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 26: చేనేత కార్మికుల ఉన్నతికి పాటుపడిన రాజ్యసభ మాజీ సభ్యుడు ప్రగడ కోటయ్య విగ్రహం త్వరలో రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్ ప్రతినిధులు వెల్లడించారు. పద్మశాలీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇమంది కన్నారావు, యువజన విభాగం అధ్యక్షుడు తీడ ఆదిదుర్గా ప్రసాద్(ఆదిబాబు) ఫ్రంట్ రాజమండ్రి శాఖ అధ్వర్యంలో శుక్రవారం తుమ్మలావ భావనాఋషి ఆలయ ప్రాంగణంలో ప్రగడ కోటయ్య 109వ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో కేకే సంజీవరావు, పుత్సల రామకృష్ణ, తమ్మిశెట్టి ప్రసాద్, నగరాజ్, నీలి కోటేశ్వరరావు, ఎన్‌వీవీ సత్యనారాయణ తదతరులు పాల్గొన్నారు.

వెలుగుబందలో ఉచిత మగ్గం వర్క్ శిక్షణ

రాజానగరం, జూలై 26: నేటి సమాజంలో పిల్లల పెంపకంపై తల్లిదండ్రుల బాధ్యత మరింతగా పెరగాలని వినయ్ సుంకర ఫౌండేషన్ చైర్మన్ సుంకర వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని వెలుగుబందలో వినయ్ సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మగ్గం వర్క్ శిక్షణను శుక్రవారం ప్రారంభించారు. ఈ శిక్షణకు దాదాపు 70 మంది మహిళలు హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్టీలు సుంకర నాగేశ్వరరావు, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు పింఛను పెంచి ఆదుకోవాలి

సీఎంకు టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ధర్మరాజు వినతి



ధవళేశ్వరం, జూలై 26: రాష్ట్రంలోని వివిధ కర్మాగారాల్లో 30ఏళ్లకు పైబడి పనిచేసిన విశ్రాంత కార్మికులు, ఉద్యోగులకు చాలా మందికి భవిష్యనిధి(పీఎఫ్) సంస్థ రూ.1000 మాత్రమే పింఛనుగా చెల్లిస్తుండగా రాష్ట్రంలోని వృద్ధులకు ప్రభుత్వం సామాజిక పింఛను రూ.4 వేలు అందిస్తోందని టీఎస్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు యర్రమోతు ధర్మరాజు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. పీఎఫ్ పింఛను పొందుతున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం అందించే సామాజిక పింఛను వర్తించదని అధికారులు చెబుతున్నారని ముఖ్యమంత్రికి తెలియజేశారు. రూ.1000 పింఛనుతో బతికే అవకాశం లేదని, రాష్ట్రం మొత్తం ఇటువంటి వారు 50వేలు మందికి మించి ఉండరని వీరికి సామాజిక పింఛను అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

టీడీపీ రాష్ట్రాధ్యక్షుడిని కలిసిన సీతారాముడు

కోరుకొండ, జూలై 26: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు మళ్ల శ్రీనివాసరావు టీడీపీ జాతీయ కార్యాలయంలో గురువారం కోరుకొండకు చెందిన రజక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాతా సీతారాముడు, పార్టీ నాయకుడు మాతా ప్రభు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తున్న సీతారాముడని శ్రీనివాసరావు అభినందించారు.

ముంపునకు శాశ్వత పరిష్కార దిశగా చర్యలు

టీడీపీ నాయకుడు గోరంట్ల రవి రామ్‌కిరణ్



లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న గోరంట్ల రవిరామ్ కిరణ్

రాజమహేంద్రవరం రూరల్/ధవళేశ్వరం, జూలై 26: గోదావరి వరద ఉధృతంగా ఉన్నప్పుడు స్థానిక సాయిబాబా గుడి సమీపంలోని అవుట్ ఫాల్స్ స్లూయిజ్ ద్వారా నీరు ఎగదన్ని నల్లా ఛానల్ ద్వారా రామకృష్ణనగర్, బాలాజీపేట, హుక్కుంపేట పరిధిలోని పలుప్రాంతాలు ముంపు బారిన పడకుండా శాశ్వత పరిష్కారం దిశగా ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్యచౌదరి ప్రణాళికతో ముందుకు వెళుతున్నారని టీడీపీ నాయకుడు గోరంట్ల రవి రామ్‌కిరణ్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం అధికారులు, నాయకులతో కలిసి సాయిబాబా గుడి వద్ద నల్లా ఛానల్‌లోని నీటిని పంపు ద్వారా గోదావరిలోకి తోడి పోస్తున్న ప్రాంతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు మత్సేటి ప్రసాద్, జనసేన అధ్యక్షుడు చొప్ప చిన్నారావు, బొప్పన నానాజీ, దుద్దుపూడి రమేష్, పెండ్యాల రామకృష్ణ, పండూరి అప్పారావు, అళ్ళ ఆనందరావు, పిన్నింటి ఏకబాబు, యడ్ల మహేష్, పుక్కల రాజా పాల్గొన్నారు.

రిజర్వేషన్ల అమలు దినోత్సవం

రాజమహేంద్రవరం సిటీ, జూలై 25: దేశంలో సాహుమహరాజ్ సంస్థానంలో స్వాతంత్రానికి పూర్వం ఎస్సీ ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు 1902లో జూలై 26న తొలిసారిగా అమలు చేశారని, ఆ సందర్భాన్ని పురస్కరించుకుని రాజమహేంద్రవరం గోదావరి బండ్ రోడ్డులో పూలే విగ్రహం వద్ద రిజర్వేషన్ల అమలు దినోత్సవాన్ని నిర్వహించారు. పూలే విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో దళిత నాయకులు నక్కా వెంకటరత్నం, ఆదినారాయణ, బొక్కా సురేష్‌కుమార్, పాల్ చక్రవర్తి, బిందుక్, డి.వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

పాఠశాలకు సౌండ్‌సిస్టం అందజేత

కడియం, జూలై 27: జక్కంపూడి నగర్ పాఠశాలకు సింగర్స్ ఫ్రెండ్స్ సొసైటీ తరుపున సంస్థ సభ్యుడు ఏరుకొండ వెంకటేష్ రూ.16 వేలు విలువైన సౌండ్‌సిస్టం అందజేశారు. కార్యక్రమంలో సింగర్స్ ఫ్రెండ్స్ సొసైటీ అధ్యక్షుడు ఆదిమూలం సాయిబాబా, హెచ్‌ఎం కె.సుబ్రహ్మణ్యం, ఎస్ఎఫ్ఎస్ సభ్యులు సురేష్, విజయలక్ష్మి, సత్యవతి, సుదర్శనం పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను నిరోధించాలి

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అచ్చియమ్మ

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 26: మానవ అక్రమ రవాణా నిరోధించడం మనందరి బాధ్యత అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అచ్చియమ్మ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు మనుషుల అక్రమ రవాణాపై రాజమహేంద్రవరం సీడీపీవో కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అచ్చియమ్మ మాట్లాడుతూ అక్రమ రవాణా ప్రపంచంలోనే అతిపెద్ద నేరంగా ఉందని, ప్రతి రోజూ ఎంతో మంది యువతులు, మహిళలు దీనికి గురవుతున్నారన్నారు. ప్రతిఒక్కరికి దీనిపై అవగాహన ఉండాలని పేర్కొన్నారు. ప్రజ్వల కో ఆర్డినేటర్ శ్రావ్య శృతి, సూపర్‌వైజర్ నాగవేణి, రమణ పాల్గొన్నారు.

డిజిటల్ టెక్నాలజీతో ఉజ్వల భవిష్యత్తు

పాఠశాలల్లో సాంకేతిక నైపుణ్య దినోత్సవం



విద్యార్థులు తయారు చేసిన రోబోను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

బిక్కవోలు, జూలై 26: విద్యార్థులు డిజిటల్ టెక్నాలజీని సక్రమంగా వినియోగిస్తే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పందలపాక జెడ్పీస్కూల్ హెచ్‌ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి సూచించారు. పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం డిజిటల్ టెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన, ప్రాక్టికల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సైన్స్ ఉపాధ్యాయులు టి. జయకృష్ణారెడ్డి, శ్యామ్ సారథ్యంలో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో వివిధ డిజిటల్ మోడల్స్ ప్రదర్శించి వివరించారు. ప్రభుత్వం అందజేసిన టాబ్స్, ఫ్లాట్ ప్యానల్స్ గూర్చి వివరించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన వివిధ మోడల్స్ ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ కోనాల సత్తిరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివాన్‌చెరువు: శిక్షా సప్తాహ్ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని అన్ని పాఠశాలల్లో సాంకేతిక నైపుణ్య దినోత్సవం నిర్వహించామని ఎంఈవో జ్యోతిప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుకు డిజిటల్ తరగతులు నిర్వహించడంతోబాటు ఉపాధ్యాయులు ఐఎఫ్‌సీ ప్యానల్ వినియోగంపై పిల్లలతో సాధన చేయించారన్నారు. సీఆర్పీలు పాఠశాలలను సందర్శించి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

రూ.4.80 లక్షలు రికవరీ చేయాలి

డ్వామా పీడీ.. రాజానగరంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక



మండల ఉపాధి ప్రజావేదికకు హాజరైన అధికారులు

రాజానగరం, జూలై 26: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలో జరిగిన పనులకు సంబంధించి రూ.4.80 లక్షలు రికవరీ చేయాలని డ్వామా పీడీ ఎ.ముఖలింగం ఆదేశించారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి నెలాఖరు వరకూ మండలంలో జరిగిన ఉపాధిహామీ పనులకు సంబంధించి మండల స్థాయి సామాజిక తనిఖీ ప్రజావేదిక సదస్సు శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జరిగింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పథకం, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలకు సంబంధించి రూ.13,09,82,933 విలువైన 2025 పనులు జరిగినట్టు నివేదికలో పేర్కొన్నారు. అయితే గృహనిర్మాణాలకు సంబంధించి జరిగిన చెల్లింపుల్లో రూ.3 లక్షలు, ఉపాధి పనుల్లో రూ1.80 లక్షలను రికవరీ చేయాలని ఆదేశించారు. నిబంధనలకు అనుగుణంగా కూలీలకు పనులు కల్పించాలన్నాు. కార్యక్రమంలో డ్వామా ఏపీడీ బి.రామ్‌ప్రసాద్, ఎంపీడీవో జ్యోతిర్మయి, ఎస్‌టీఎం గౌరీశంకర్, వెలుగు డీపీఎం గణేశ్వరరావు, అధికారులు ఎస్.ఖాదర్‌బాషా, డీపీవీ నరేష్, ఎస్.నరేష్‌బాబు పాల్గొన్నారు.

సెస్ రద్దుతో పొగాకు రైతులకు రూ.111 కోట్లు ఆదా

దేవరపల్లి, జూలై 26: కేంద్ర వాణిజ్యశాఖ ఇటీవల పొగాకు రైతులకు అదనంగా పండించిన అమ్మకంపై సెస్ రద్దు చేయడంతో రాష్ట్రంలో పొగాకు రైతులకు రూ.111 కోట్లు ఆదా అయ్యిందని పొగాకు బోర్డు ఏఎం దామోదర్ తెలిపారు. దేవరపల్లి పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం పొగాకు రైతులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పొగాకు రైతులు పరిమితి మేరకే పొగాకు ఉత్పత్తి చేయాలని సూచించారు. పొగాకు రైతులు పండించిన పొగాకు అదనపు పన్ను రద్దు చేయాలని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్‌గోయల్‌తో ఇటీవల ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి కోరగా అదనపు పన్ను రద్దు చేయడం ఆనందదాయకమన్నారు. వచ్చే ఏడాది ఇలాగే సెస్ రద్దవుతుందని భావించవద్దన్నారు. ఒక్కొక్క పొగాకు రైతుకు రూ.80 వేల నుంచి లక్ష వరకు ఆదాయం కలిసివచ్చిందన్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: రాయన్
సూర్యామినీ	: డెడ్‌పూల్ అండ్ వోల్వరిన్
సూర్యాప్యాలస్	: రాయన్
స్వామి	: డెడ్‌పూల్ అండ్ వోల్వరిన్
శివజ్యోతి	: డెడ్‌పూల్ అండ్ వోల్వరిన్
అనుశ్రీ(సాయికృష్ణ)	: డార్లింగ్
రాజా	: -----
ఊర్వశి	: భారతీయుడు-2
రంభ	: పురుషోత్తముడు
మేనక	: డెడ్‌పూల్ అండ్ వోల్వరిన్
అప్సర	: డెడ్‌పూల్ అండ్ వోల్వరిన్
కుమారి	: ఆపరేషన్ రావణ్
అశోక	: కల్కి
వీఎస్ మహాల్(నామవరం)	: రాయన్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: కల్కి
వెంకటసూర్య(కడియం)	: రాయన్
సత్యగౌరి (అనపర్తి)	: భారతీయుడు-2
సూర్యశ్రీ (అనపర్తి)	: ఆ ఒక్కటీ అడక్కు
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: రాయన్
రామకృష్ణ(కోరుకొండ)	: భారతీయుడు-2
గీతాసినిమాస్ (సీతానగరం)	: రాయన్
శ్రీనివాస (గోకవరం)	: రాయన్
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: ---
లలితామహాల్(రంపచోడవరం)	: రాయన్
నవయుగ(చింతూరు)	: -----



చాలా అదృష్టం.. తప్పిన ప్రమాదం!



చెట్టుకూలి పడిన విద్యుత్ స్తంభాలు.. కారుపై పడిన తీగలు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 26: రాజమహేంద్రవరం టీటీడీ కళ్యాణ మండపం రోడ్డులో శుక్రవారం సాయంత్రం అకస్మాత్తుగా ఒక చెట్టు కూలిపోయింది. దాంతో ఆ చెట్టు కింద నుంచి వెళ్లిన 11 కేవీ విద్యుత్ లైన్లు ఉన్న రెండు విద్యుత్ స్తంభాలు కూడా పడిపోయాయి. వాటి కరెంటు వైర్లు వెళుతున్న రెండు కార్లపై పడ్డాయి. అయితే విద్యుత్ వైర్లపై చెట్టుపడిన వెంటనే ట్రిప్ అయ్యి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో తృటిలో ప్రమాదం తప్పింది. కార్లలో ఉన్నవారు సురక్షితంగా బయటపడ్డారు. విద్యుత్ సరఫరాతో వైర్లు ఆ కార్లపై పడివుంటే చాలా ప్రమాదం అయ్యేది. వెంటనే విద్యుత్‌శాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ పనులు చేపట్టారు. గత నాలుగురోజులపాటు కురిసిన వర్షాలకు పూర్తిగా నానిపోయిన చెట్టు అకస్మాత్తుగా కూలిపోయింది. విద్యుత్ వైర్లతో రెండు స్తంభాలు కూలడంతో స్థానికులు భయాందోళనతో పరుగులు తీశారు. విద్యుత్ శాఖాధికారులు వెంటనే అక్కడకు చేరుకుని మరమ్మత్తులు ప్రారంభించడంతో ఊపిరిపీల్చుకున్నారు.

సోమవారం నుంచి బడుల్లో ఆకస్మిక తనిఖీలు : కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, జూలై26(ఆంధ్రజ్యోతి): సోమవారం నుంచి స్కూల్స్‌లో ఆకస్మిక తనిఖీలు చేస్తానని కలెక్టర్ పి.ప్రశాంతి స్పష్టంచేశారు. ఆ సమయంలో పారిశుధ్యం సహా అన్ని అంశాలనూ పరిశీలించడం జరుగుతుందన్నారు. అలసత్వాన్ని సహించేది లేదని స్పష్టంచేశారు. పాఠశాల విద్యాశాఖాధికారులతో శుక్రవారం ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యవేక్షణ, అప్రమత్తత వల్ల అభ్యసనలో మెరుగైన ఫలితాలతోపాటు నిర్వహణా సామర్థ్యాలను గణనీయంగా పెంచడానికి వీలు కలుగుతుందన్నారు. విద్యార్థుల హాజరు, పాఠశాలల నిర్వహణ, మధ్యాహ్న భోజనం, నూరుశాతం చేరికలు, స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంప్రూమెంట్ పనులు తదితర అంశాలపై అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో ఎస్‌వోపీని తప్పకుండా అమలుచేయాలన్నారు. దీనిపై ఉపాధ్యాయులను తనిఖీ అధికారులు జాగృతం చేయాలన్నారు. ఇప్పటి వరకూ గమనించిన లోటుపాట్లు, వాటి పరిష్కారాలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇకో క్లబ్‌పై విద్యార్థుల్లో చైతన్యం తీసుకురావాలని ఆమె చెప్పారు. మొక్కలు నాటడడంతోపాటు సంరక్షించేలా చూడాలన్నారు. ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడంపై స్కూల్స్ వారీగా సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పాఠశాల విద్యాధికారి కె.వాసుదేవరావు, ఎస్ఎస్ఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.సుభాషిణి పాల్గొన్నారు.

సమీక్ష చేస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి



అదే ఉధృతి

- ధవళేశ్వరం బ్యారేజీ వద్ద కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరిక
- స్వల్పంగా పెరుగుతున్న గోదావరి
- ఇప్పటికే 743 టీఎంసీలు సముద్రం పాలు
- రాత్రి 11 గంటలకు బ్యారేజీ నుంచి 12,44,232 క్యూసెక్కులు సముద్రంలోకి
- నష్టం అంచనాలకు కమిటీలు నియమించిన జిల్లా కలెక్టర్ ప్రశాంతి

కొవ్వూరు గోష్పాద క్షేత్రం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

రాజమహేంద్రవరం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): అఖండ గోదావరి ఉగ్రంగా ప్రవహిస్తోంది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ఇంకా రెండు మూడు రోజులపాటు మొదటి ప్రమాద హెచ్చరిక అమలులో ఉండవచ్చని అధికారులు చెబుతున్నారు. శుక్రవారం రాత్రి 11 గంటలకు ధవళేశ్వరం బ్యారేజీ నీటిమట్టం 13.50 అడుగులుగా ఉంది. బ్యారేజీ నుంచి 12,44,232 క్యూసెక్కుల నీరు సముద్రంలోకి పోతోంది. భద్రాచలం వద్ద 48.60 అడుగులుగా ఉంది. ఎగువ భాగంలో వాతావరణం మేఘావృతంగా ఉంది. ప్రస్తుతం జిల్లాలో వర్షాలు లేవు. కానీ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడడం వల్ల మూడురోజులపాటు ఓ మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉన్నట్టు హెచ్చరిక చేశారు. ఈనెల 19వ తేదీకి ధవళేశ్వరం వద్ద సుమారు 3.6 లక్షల క్యూసెక్కుల వరద సముద్రంలోకి పోతుండగా, అప్పటి నుంచి వరద పెరుగుతూ ఉండడంతో 22వ తేదీ ఉదయం ఏడు గంటలకు మొదటి హెచ్చరిక జారీచేశారు. తర్వాత రెండో ప్రమాద హెచ్చరిక జారీకావడం, కాస్త వరద తగ్గడంతో దాన్ని ఉపసంహరించుకున్నారు. కానీ మళ్లీ వరద పెరగడంతో ప్రస్తుతం భద్రాచలం, ధవళేశ్వరం బ్యారేజీ వద్ద కూడా మొదటి ప్రమాద హెచ్చరికలు కొనసాగుతున్నాయి. అంతేకాక ఇక్కడ నీటిమట్టం రెండో ప్రమాద హెచ్చరికకు దగ్గరగా ఉంది. వరద ఉధృతి స్వల్పంగానే పెరుగుతున్నా గోదావరి ఉగ్రరూపంలోనే ఉంది. పోలవరం స్పిల్‌వే, ఎగువ కాఫర్ డ్యామ్ వద్ద సముద్రాన్ని తలపిస్తోంది. ముఖ్యంగా రాజమహేంద్రవరం-కొవ్వూరు మధ్య గోదావరి తీవ్రరూపం దాల్చింది. గోదావరి స్నాన ఘట్టాలలో నిషేధాజ్ఞలు కొనసాగుతున్నాయి. పునరావాస కేంద్రాలు కూడా కొనసాగుతున్నాయి. ధవళేశ్వరం సాయిబాబా గుడి వద్ద డ్రైన్ స్లూయిజ్‌ను గోదావరి వరద ఎగదన్నడంతోపాటు రాజమహేంద్రవరంలోని పలు ప్రాంతాల్లో డ్రైన్లు పొంగి వీధులను ముంచెత్తాయి.

నష్టాలు అంచనాలకు కమిటీలు నియమించిన కలెక్టర్

జిల్లాలో ఇటీవల భారీగా కురిసిన వర్షాలు, వరదలతోపాటు బురదకాలువ, జెల్లకాలువ, కొవ్వాడ, ఎర్రకాలువ వంటివి ఉప్పొంగడంతో జరిగిన నష్టాలను తక్షణం లెక్కించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లాలో 119 ఇళ్లకు నష్టం జరిగిన ప్రాథమిక అంచనారాగా, రెవెన్యూ, హౌసింగ్ ఏఈ, ఎంపీడీవోలతో ఒక కమిటీని వేసి ఒక్కరోజులోనే నష్టాల నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. వ్యవసాయశాఖకు సంబంధించి గ్రామ, మండల స్థాయిలలో కమిటీలు వేసి మూడు రోజుల్లో నివేదిక ఇవ్వాలన్నారు. మిగిలిన శాఖలలో జరిగిన నష్టాల గురించి కూడా ఎన్యుమరేషన్ వెంటనే జరగాలన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వరద, భారీ వర్షాల వల్ల బాధితులుగా ఉన్నవారికి తక్షణం రూ.3 వేల వంతున సహాయం చేయాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. జిల్లా స్థాయిలో కూడా గతంలో ఎన్నడూ లేనంతగా ఎర్రకాలువ బాధితులకు పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేశారు. వరద బాధితులకు యంత్రాంగం అండగా నిలిచింది.

పెరుగుతోంది..

కొవ్వూరు, జూలై 26 : గత వారం రోజులుగా గోదావరి వరద తగ్గుతూ, పెరుగుతూ దోబూచులాడుతోంది. అఖండ గోదావరి మళ్లీ పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు వరద ప్రవాహం నదిలో వచ్చి చేరుతోంది. దీంతో గోదారమ్మ పొటెత్తి నిండుకుండలా పరవళ్లు తొక్కుతోంది. ఎగువ నుంచి వరద ప్రవాహం అధికంగా వచ్చి నదిలో చేరడంతో వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉందని ఏజీఆర్‌బీ అధికారులు చెబుతున్నారు. దిగువన ధవళేశ్వరం వద్ద మూడో ప్రమాద హెచ్చరిక స్థాయి వరకు పెరిగి నెమ్మదిగా తగ్గుముఖం పట్టవచ్చని కొవ్వూరు అఖండ గోదావరి కుడిగట్టు విభాగం ఏఈఆర్ సునీల్‌బాబు తెలిపారు. కాగా గత వారం రోజులుగా కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోని ప్రధాన స్నాన ఘట్టాలు వరద ముంపులోనే కొనసాగుతున్నాయి. నదీ ప్రవాహం ఉధృతంగా ఉండడంతో నదిలోకి ఎవరు వెళ్లకుండా అధికార పార్టీ యంత్రాంగం చర్యలు చేపట్టింది. విజ్జేశ్వరం నుంచి పోలవరం దాకా ఏటిగట్లను పరిశీలించామని ప్రస్తుతం ఎటువంటి ప్రమాదం లేదని, ముందస్తు చర్యలు కూడా చేపట్టినట్టు సునీల్‌బాబు తెలిపారు.



గోదావరి వరద వల్ల స్థానిక కుమారి టాకీస్ సమీపంలోని ఘాట్ వద్ద ఖాళీగా కూర్చున్న మత్స్యకారులు



ఏటిగట్టు ఆనుకుని ఉన్న లంక భూమి కోతకు గురై తాడిచెట్టు కొట్టుకుపోతున్న దృశ్యం

ఏటిగట్టు బలహీనం.. ఆందోళన చెందుతున్న గోదావరి తీరం జనం

సీతానగరం, జూలై 26 : గోదావరి మళ్లీ పెరుగుతుండడంతో తీరం వెంబడి ఉన్న గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సీతానగరం మండలంలోని లంక గ్రామమైన ములకల్లంక వెళ్లడానికి ప్రజలు మరబోట్లను ఆశ్రయిస్తున్నారు. అయితే లైఫ్ జాకెట్లు వినియోగించడం లేదు. లంక గ్రామంలో వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి అవసరమైన వారికి వైద్య సేవలు అందిస్తున్నారు. గోదావరి పరవళ్లు తొక్కుతుండడంతో బొబ్బిల్లంక స్లూయిజ్ నుంచి మండలంలోని ముసుగు కాలువ నీరు గోదావరిలో కలిసే అవకాశం లేకపోవడంతో పంట భూములు ఇంకా నీటిలోనే ఉన్నాయి. బొబ్బిల్లంక వద్ద ఏటిగట్టు బలహీనంగా ఉండడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. బొబ్బిల్లంక అంబేడ్కర్ బొమ్మ వద్ద, అశోక్ నగర్ వద్ద ఏటిగట్టు బలహీనంగా ఉందని, గోదావరి ఇంకా పెరిగితే ఏటిగట్టు ప్రమాదంలో పడుతుందని గ్రామస్తులు అంటున్నారు. గోదావరి లెఫ్ట్ బ్యాంకు కెనాల్ ఏఈ శివప్రసాద్ ఏటిగట్టును శుక్రవారం పరిశీలించి ఆయన మాట్లాడుతూ ఏటిగట్టుకు గండ్లు పడకుండా చర్యలు చేపడుతున్నామని చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి ప్రశాంతి

ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యత కల్పించాలి

సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులు లాభసాటి అయ్యేలా కృషి

పొలంబడి 'గాప్' సర్టిఫికేషన్ శిక్షణలో కలెక్టర్ పి ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, జూలై 26: వ్యవసాయరంగంలో ప్రకృతి వ్యవసాయానికి తగిన ప్రాధాన్యం కల్పించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. రాజమహేంద్రవరంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం 2024-25 సంవత్సరంలో పొలంబడి జీఏపీ (గుడ్‌అగ్రికల్చర్ ప్రాడక్ట్) సర్టిఫికేషన్ ప్రోగ్రామ్‌పై వ్యవసాయ అధికారులకు నిర్వహించిన జిల్లాస్థాయి ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు శాస్త్రీయ వ్యవసాయ సాగు విధానం దిశలో ప్రకృతి వ్యవసాయం చేపట్టేలా తీర్చిదిద్దడమే కాకుండా, వారు పండించిన పంటలకు తగిన ధరలు కలుగజేసేలా కృషి చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయంలో రైతులకు ఆధునిక పద్ధతులు ఆచరించేలా చేయడం, పొలంబడి కార్యక్రమాలను గ్రామం ఒక యూనిట్‌గా చేపట్టాల్సి ఉందన్నారు. ఈ ప్రక్రియలో వ్యవసాయ అధికారుల పాత్ర కీలకం అన్నారు. రైతులను, మార్కెటింగ్ వర్గాలను భాగస్వామ్యం చేసి మనందరి కార్యక్రమనే దృక్పథం కలుగజేస్తే అనుకున్న ఫలితాలు సాధించడం సాధ్యమవుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయ లక్ష్యంతో అన్నదాతలకు తగిన ప్రోత్సాహం, మద్దతు ఇవ్వడం ద్వారా వారిని ఆరోగ్యదాతలుగా మార్చడం సాధ్యమవుతుందన్నారు. మంచి వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహించి తగిన గుర్తింపు తీసుకొని రావడంలో అధికార ధోరణిలో కాకుండా రైతుల, సామాజిక కోణంలో ప్రోత్సాహం అందించి వారిని భాగస్వామ్యం చేయాలని కోరారు. నేటి ఆధునిక పోకడలను దృష్టిలో పెట్టుకొని పొలంబడులు క్షేత్రస్థాయిలో నిర్వహిస్తూ మేలైన వ్యవసాయ యాజమాన్య పద్ధతులు రైతులకు అందుబాటులో తీసుకొని రావడం వ్యవసాయ అధికారుల కర్తవ్యం అని స్పష్టం చేశారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ మాధవరావు మాట్లాడుతూ గతేడాది జిల్లాలో కేవలం ఒక్క గాప్ పొలంబడి కార్యక్రమం నిర్వహించామని, మంచి వ్యవసాయ పద్ధతులను అభ్యసించే దిశగా మరిన్ని కార్యక్రమాలు నిర్వహించేందుకు శిక్షణ తరగతులను చేపట్టినట్టు చెప్పారు. ఈ శిక్షణలో జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు, డివిజనల్, మండలస్థాయి వ్యవసాయాధికారులు, మాస్టర్ శిక్షకులు కె.కమల్‌రాజు, ఎ.భీమారాజు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు పెంచాలి: కలెక్టర్

రాజమహేంద్రవరం అర్బన్, జూలై26: అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలని కలెక్టర్ ప్రశాంతి అన్నారు. అలాగే జిల్లాలో రోగ నిరోధక టీకా లక్ష్య సాధన క్షేత్రస్థాయిలో పక్కాగా నిర్వహించాలని పేర్కొన్నారు. శుక్రవారం రాజమహేంద్రవరంలోని జిల్లా కలెక్టరేట్ కార్యాలయం సమావేశ మందిరంలో వైద్య, ఆరోగ్యశాఖ ద్వారా జిల్లాలో అమలు జరుగుతున్న ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రోగ నిరోధక శక్తిని పెంచే టీకాలను నిర్దేశించిన వయస్సు కల్గిన పిల్లలందరికీ క్రమం తప్పకుండా వేయాల్సి ఉందన్నారు. ఈమేరకు తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణ లక్ష్యంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలు అందించాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డిప్యూటీ డీఅండ్‌ఎంహెచ్‌వోలు డాక్టర్ జె.సంధ్య, డాక్టర్ ఎం.శ్రీహరిబాబు,డీఐవో డాక్టర్ రాజకుమారి పాల్గొన్నారు.





ట్రాఫిక్, హోంగార్డుల సిబ్బందితో జరిగిన పరేడ్‌లో గౌరవ వందనం స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్.. పక్కన కవాతు జరుగుతున్న దృశ్యం

ప్రజల రక్షణే పోలీస్ విధుల లక్ష్యం

సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట ▸ జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ▸ పరేడ్ గ్రౌండ్స్‌లో ట్రాఫిక్, హోంగార్డు సిబ్బంది కవాతు

రాజమహేంద్రవరం, జూలై26(ఆంధ్రజ్యోతి): ప్రజలకు రక్షణ కల్పించడమే పోలీస్ విధుల లక్ష్యమని ఎస్పీ డి.నరసింహ కిషోర్ పేర్కొన్నారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో సాయుధ రిజర్వు, శాంతి భద్రతలు, ట్రాఫిక్, హోంగార్డు విభాగాల సిబ్బంది శుక్రవారం కవాతు నిర్వహించారు. వారి నుంచి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు భద్రత కల్పించే విషయంలో పోలీసులు పూర్తి సమన్వయంతో పనిచేయాలన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా నడుచుకోవడంతోపాటు మనోధైర్యాన్ని కల్పించాలన్నారు. ఈ క్రమంలో ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ఎదుర్కోడానికి నిరంతరం సిద్ధంగా ఉండాలన్నారు. పోలీసులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటేనే మెరుగైన సేవలు అందించే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి రోజూ వ్యాయామం, యోగా చేయడం మేలు చేస్తుందన్నారు. సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని.. అదే సమయంలో సిబ్బంది కూడా ఆరోగ్యం విషయంలో అశ్రద్ధ చేయరాదన్నారు. అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు ఆలస్యం చేయకుండా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకొచ్చి అవసరమైన వైద్య సహాయం పొందాలని చెప్పారు. విధులతోపాటు కుటుంబానికి కూడా ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సిబ్బంది తమకు ఎలాంటి సమస్య ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలని.. మానసికంగా కుంగుబాటుకు గురికావద్దని ఆయన సూచించారు. పరేడ్‌లో పాల్గొన్న సిబ్బందితో మాట్లాడి వారి ఇబ్బందులపై ఆరా తీశారు. ప్రతి శుక్రవారం పరేడ్ నిర్వహించి అన్ని విభాగాలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అడిషనల్ ఎస్పీలు ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు (పరిపాలన), ఎల్.చెంచిరెడ్డి (సాయుధ రిజర్వు), డీఎస్పీలు రవికుమార్ పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమంలో హాజరైన ప్రకాశ్‌బాబు

ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలు

డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రకాశ్‌బాబు

రాజమహేంద్రవరం/దివాన్‌చెరువు జూలై 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ర్యాగింగ్ వంటి అనైతిక పనులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకునే హక్కు యాజమాన్యానికి ఉంటుందని, ఒకవేళ వారు అలా చేయకపోతే వారిపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు స్పష్టంచేశారు. మాదకద్రవ్యాల నిషేధం, ర్యాగింగ్ నిషేధ చట్టంపై రాజమహేంద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. చెడు స్నేహాలు, పరిస్థితుల ప్రభావంతో వాటి ఉచ్చులో పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. తాత్కాలిక ఆనందం కోసం వాటిని తీసుకుంటే ఆరోగ్యం పాడవడంతోపాటు సమాజంలో చులకన అవుతారన్నారు. మాదకద్రవ్యాలు కలిగి ఉండడం, వాడడం, విక్రయం, నిల్వ, తయారీ వంటివన్నీ క్రిమినల్ నేరాల కింద చట్టం పరిగణిస్తుందన్నారు. మాదకద్రవ్యాలకు అలవాటుపడిన వారు మార్పుకోసం తమను సంప్రదిస్తే ఉచిత వైద్య సహాయం అందించే ఏర్పాటు చేస్తామన్నారు. అలాంటి వారిపై ఎలాంటి నేర విచారణా ఉండదని చెప్పారు. ర్యాగింగ్ కేసుల్లో నేరం రుజువై 6 నెలల కంటే ఎక్కువకాలం శిక్షపడితే కళాశాల నుంచి డీబార్ చేస్తారన్నారు. అనంతరం రోడ్డు ప్రమాదాల నివారణపై రాజమండ్రి రైల్వే స్టేషన్లో అవగాహన కార్యక్రమంలోనూ ఆయన పాల్గొన్నారు.

రూ.2.20 కోట్లతో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి పరార్

రాజమహేంద్రవరంలోని దానవాయిపేట హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వద్ద ఘటన

నిందితుడు ఏటీఎంలో డబ్బులు పెట్టే ఉద్యోగం

అతని సొంతూరు కపిలేశ్వరపురం మండలం మాచరమట్ల

గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు

పోలీసుల తీరుపైనా అనుమానాలు

- వివరాలు మెయిన్‌లో

జనసేనతో జతకు సిద్ధం

- పార్టీ మారనున్న పలువురు నిడదవోలు వైసీపీ కౌన్సిలర్లు
- కూటమి నాయకులతో మంతనాల్లో బిజీబిజీ

- 8లో

కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే కృష్ణబాబు మృతికి రాష్ట్ర అసెంబ్లీలో సంతాపం

కొవ్వూరు, జూలై 26: కొవ్వూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పెండ్యాల వెంకట కృష్ణారావు (కృష్ణబాబు) మృతికి రాష్ట్ర అసెంబ్లీ సమావేశం సంతాపం తెలియజేసింది. రాష్ట్ర అసెంబ్లీలో శుక్రవారం శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు రాష్ట్రంలో ఇటీవల మరణించిన ప్రముఖులకు నివాళులు అర్పించాలని కోరుతూ కృష్ణబాబు మృతికి సంతాపం తెలియజేశారు. కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే, ప్రముఖ పారిశ్రామికవేత్త, దొమ్మేరు జమిందార్ పెండ్యాల వెంకట కృష్ణారావు(కృష్ణబాబు) అనారోగ్యంతో 2024 మే 21వ తేదీన కన్నుమూశారు. కొవ్వూరు నియోజకవర్గం నుంచి కృష్ణబాబు అయిదుసార్లు తెలుగుదేశం పార్టీ తరపున ఎమ్మెల్యేగా గెలుపొందారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు పిలుపుమేరకు రాజకీయాలలోకి వచ్చి కొవ్వూరు నియోజకవర్గం నుంచి 1983, 1985, 1989, 1994 ఎన్నికల్లో వరుసగా టిడిపి తరపున ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1999లో ఓటమిపాలైనప్పటికీ మళ్లీ 2004లో మరోసారి విజయం సాధించారు. అలా నియోజకవర్గంలో అత్యధికసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై 23 ఏళ్లపాటు శాసనసభ్యునిగా పనిచేసిన నాయకుడిగా రికార్డు నెలకొల్పారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజనతో కొవ్వూరు ఎస్సీ రిజర్వు కావడంతో ఆయన పోటీకి దూరమయ్యారు. నిస్వార్థంగా ప్రజాసేవ చేయడంతో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో తిరుగులేని నేతగా దశాబ్దాలపాటు పేరుపొందారు. కొవ్వూరు నియోజకవర్గంతోపాటు, పోలవరం, గోపాలపురం, చింతలపూడి, తణుకు నియోజకవర్గ అభ్యర్థుల గెలుపులో కీలకపాత్ర పోషించేవారని సభలో కొనియాడారు.

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

'నీట్' రద్దుపై అసెంబ్లీలో తీర్మానం చేయాలి

కొవ్వూరులో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆందోళన



ప్రభుత్వ జూనియర్ కాలేజీ వద్ద ఆందోళన చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కొవ్వూరు, జూలై 26: రాష్ట్రంలో నీట్ పరీక్షను రద్దుచేస్తూ కర్ణాటక అసెంబ్లీ తీర్మానం చేసినట్టు ఏపీ అసెంబ్లీలో తీర్మానం చేయాలని కొవ్వూరులో విద్యార్థి సంఘాలు ఆందోళన చేపట్టాయి. శుక్రవారం స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల వద్ద పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంబూరి మహర్షి, కార్యదర్శి కాకి నాని మాట్లాడుతూ నీట్ పరీక్షా విధానంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. రాష్ట్రంలో కొవ్వూరులో మాదిరిగా జూనియర్, డిగ్రీ విద్యార్థులకు ఒకే ప్రాంగణంలో షిఫ్ట్‌ల విధానంలో తరగతులు నిర్వహించడం వల్ల విద్యార్థులు నష్టపోతున్నారు. ఆ విధానాన్ని తక్షణం రద్దుచేసి పూర్తిస్థాయిలో కళాశాలలు నిర్వహించే విధంగా ప్రభుత్వం ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు బన్నె వినోద్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా కొవ్వూరమ్మ



కొవ్వూరు, జూలై 26: కొవ్వూరు గ్రామదేవత కొవ్వూరమ్మను భక్తులు శాకాంబరిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢమాసం సందర్భంగా శుక్రవారం కొవ్వూరమ్మను వివిధ రకాల కూరగాయలతో ప్రత్యేక అలంకరణ చేశారు. మహిళలు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

ఏఎంసీలలో పోస్టులను ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో భర్తీ చేయాలి



రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరత్నం

కొవ్వూరు, జూలై 26: వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో ఖాళీగా ఉన్న పోస్టులను ఇప్పటికే అందులో పనిచేసే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో భర్తీ చేయాలని ఏపీ వ్యవసాయ మార్కెట్ కమిటీల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటరత్నం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఈ నెల 28న ప్రకాశం జిల్లా దర్శి వ్యవసాయ మార్కెట్ కమిటీలో నిర్వహిస్తున్నామని, 26 జిల్లాల ప్రతినిధులు పాల్గొనాలన్నారు. వెంకటరత్నం మాట్లాడుతూ ఈ సమావేశంలో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలియజేస్తామని, మార్కెట్ కమిటీల్లో పనిచేసే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగభద్రత కల్పించాలని, 30 ఏళ్లుగా కార్మికులకు మినిమం టైమ్ స్కేలు అమలు పర్చాలని, ఖాళీగా ఉన్న పోస్టులను 30 ఏళ్లుగా పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందితో భర్తీ చేయాలని చర్చిస్తామన్నారు. అలాగే నూతన కార్యవర్గం ఎన్నిక జరుగుతుందని పేర్కొన్నారు.

నేడు కొవ్వూరు కౌన్సిల్ సమావేశం

కొవ్వూరు, జూలై 26: కొవ్వూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం ఉదయం 11గంటలకు నిర్వహిస్తున్నట్టు చైర్‌పర్సన్ బావన రత్నకుమారి తెలిపారు. పట్టణంలోని 23 వార్డుల్లో చేపట్టిన, చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులపై చర్చిస్తామని, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

రోటరీ క్లబ్ మిడ్ టౌన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేసిన రోటరీ క్లబ్ ఆఫ్ మిడ్‌టౌన్ ప్రతినిధులు

నిడదవోలు, జూలై 26: రోటరీ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో స్థానిక క్లబ్‌లు సేవా కార్యక్రమాలకు పెద్దపీట వేస్తున్నాయని రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ నామిని గుత్తికొండ శ్రీరామ్ అన్నారు. నిడదవోలులోని అంబేడ్కర్ మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్లో శుక్రవారం జరిగిన రోటరీ క్లబ్ మిడ్‌టౌన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. జిల్లాలోనే నిడదవోలు రోటరీ మిడ్ టౌన్ సేవా కార్యక్రమాల్లో ముందుండేలా నూతన కార్యవర్గం కృషి చేయాలన్నారు. అధ్యక్షుడిగా రాచర్ల చైతన్యబాబు, కార్యదర్శిగా ఆకుల రాజీవ్, కోశాధికారిగా కొయ్యే కృష్ణంరాజు పలువురు బోర్డు డైరెక్టర్లుగాను ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు.

సీఎం ప్రకటనతో సీపీఎస్ ఉద్యోగులకు ఊరట

తాళ్లపూడి, జూలై 26: సీపీఎస్ ఉద్యోగులపై ఉన్న కేసులు ఎత్తి వేస్తామనే హామీని శాసనసభలో ప్రకటించిన సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్టు సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జోడాల వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. సీపీఎస్ అమలులోకి వచ్చినప్పటి నుంచి సెప్టెంబరు 1ని పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తూ తమ నిరసనను శాంతియుతంగా చేస్తున్న తరుణంలో రెండు రోజుల పాటు వివిధ పోలీసు స్టేషన్లకు తిప్పుతూ ఇబ్బందులకు గురిచేసిన గత ప్రభుత్వం ఉద్యోగులపై కేసులు నమోదు చేసిందని గుర్తుచేశారు. ఉద్యోగుల సంక్షేమంపై దృష్టి సారిస్తున్న కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ ఉద్యోగులకు ఇవ్వాల్సిన డీఏ, ఐఆర్, పీఆర్సీలు అన్నీ సక్రమంగా అందేటట్టు చూడాలని కోరుతున్నట్టు చెప్పారు.

దేశ రక్షణకు యువత సైన్యంలో చేరాలి



కార్గిల్ విజయ్ దివాస్‌లో పాల్గొన్న బీజేపీ నాయకులు

కొవ్వూరు, జూలై 26: కార్గిల్ పోరాటంలో మన సైనికుల ధైర్య సాహసాలు వారి అచంచలమైన నిబద్ధతకు నిదర్శనమని బీజేపీ పట్టణాధ్యక్షుడు మడిచర్ల రామచంద్రరావు అన్నారు. కొవ్వూరులోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో కార్గిల్ విజయ్ దివాస్‌ను శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్మీలో పనిచేసి రిటైర్డ్ అయిన గెడ్డం నాగేశ్వరరావు, పసుపులేటి మురార్జి బాబులను సత్కరించారు. పలువురు మాట్లాడుతూ 1999 జూలై 26న పాకిస్తాన్ ఆర్మీ దళాలను వారి ఆక్రమిత స్థానాల నుంచి తరిమికొట్టడంతో భారత్, పాకిస్థాన్ యుద్ధం అధికారికంగా ముగిసింది. దీంతో ఆ రోజును కార్గిల్ విజయ్ దివాస్‌గా గుర్తించారన్నారు. ఈ యుద్ధంలో భారత సాయుధ బలగాలకు చెందిన 527 మంది సైనికులు ప్రాణాలు కోల్పోయారన్నారు. వారి ఆత్మకు శాంతి కలగాలని నివాళులర్పించారు. త్రిదళాలు దేశానికి అందించే సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. దేశ రక్షణ కోసం యువత సైన్యంలో చేరాలన్నారు. కార్యక్రమంలో బోడపాటి ముత్యాలరావు, హెచ్ఎం టి.శ్రీనివాస రామానుజం, నీరుకొండ సూర్యనారాయణ, తాడిమళ్ల విజయవాణి. డాక్టర్ కె.అనూరాధ పాల్గొన్నారు.

వర్షాలతో ఆకుకూరల రైతులకు తీవ్ర నష్టం



తాళ్లపూడి, జూలై 26: ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు ఆకు కూరలు పండించే రైతాంగం పూర్తిగా నష్ట పోయిందని వారిని ప్రభుత్వం ఆదుకోవాలని ఆకు కూరల రైతు రాధాకృష్ణ కోరారు. మండలంలోని రావూరుపాడు, పెద్దేవం గ్రామాల్లో ఎక్కువ శాతం రైతులు ఆకు కూరలు పండిస్తూ జీవనం సాగిస్తుంటారు. సుమారు రెండు వందల ఎకరాల్లో కొత్తిమీర, పుదీన, తోటకూర, పాలకూరలు పండిస్తుంటారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఎక్కువ శాతం కుళ్లిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటితో పాటు కంద పొలాలు తెగుళ్ల పట్టి దెబ్బతిన్నాయని వాపోతున్నారు.

జనసేనతో జతకు సిద్ధం

- పార్టీ మారనున్న పలువురు నిడదవోలు వైసీపీ కౌన్సిలర్లు
- కూటమి నాయకులతో మంతనాల్లో బిజీబిజీ
- అన్నీ కుదిరితే నేడే.. లేకుంటే అతి త్వరలో ..



నిడదవోలు పురపాలక సంఘ కార్యాలయం

నిడదవోలు, జూలై 26: రాష్ట్రంలోనే కాదు.. జిల్లాలో ప్రతిచోట పలువురు వైసీపీని వీడి కూటమి వైపు అడుగులు వేస్తున్నారు. అధికారంలో ఉండగా గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రజా సమస్యలను ప్రస్తావించలేక అణిగిమణిగి ఉన్న ప్రజాప్రతినిధులు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిరసన గళం వినిపిస్తున్నారు. వైసీపీని వీడేందుకు నాయకులతో పాటు కార్యకర్తలు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో నిడదవోలు పురపాలక సంఘంలోని వైసీపీకి చెందిన కొందరు కౌన్సిలర్లు జనసేనతో జతకట్టేందుకు రంగం సిద్ధం చేసుకొంటున్నారు. నిడదవోలు పురపాలక సంఘానికి 2021లో మున్సిపల్ కౌన్సిల్ ఎన్నికలు జరగ్గా 28 వార్డులకు గాను ఒక్క వార్డులోనే టీడీపీ విజయం సాధించగా మిగతా వార్డుల్లో వైసీపీ అభ్యర్థులు విజయం సాధించి పాలకవర్గం ఏర్పాటు చేసుకున్నారు. అప్పటి ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు నేను రాజు.. నేనే మంత్రి.. అన్న రీతిలో వ్యవహరించారు. కౌన్సిల్ సమావేశాల్లో సైతం కౌన్సిలర్లు పట్టణ సమస్యలను కూడా ప్రస్తావించలేని పరిస్థితుల్లో అజెండాలను ఏకగ్రీవంగా ఆమోదం తెలపడంతోనే సరిపోయింది. అయితే ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం కందుల దుర్గేష్ విజయం సాధించి మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. దీంతో పలువురు కౌన్సిలర్లు కూటమి వైపు చూస్తున్నారు. ఇప్పటికే పలువురు వైసీపీ కౌన్సిలర్లు కూటమి నాయకులతో మంతనాల్లో బిజీబిజీగా ఉన్నారు. ఇదే జరిగితే భవిష్యత్తులో చైర్మన్ గిరి సైతం కూటమికే వచ్చే దిశగా ఒక ముఖ్య నాయకుడు పావులు కదుపుతున్నాడు. ప్రస్తుతం నిడదవోలులో రాజకీయం రసవత్తరంగా మారింది.

● ఈ నెల 27న(నేడు) పురపాలక సంఘ కౌన్సిల్ హాలులో జరిగే సాధారణ సమావేశానికి మంత్రి హాజరు కానున్నారనే సమాచారంతో ఆయన సమక్షంలో పలువురు కౌన్సిలర్లు వైసీపీకి రాజీనామా చేసి జనసేన పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. అన్నీ కుదిరితే కౌన్సిల్ సమావేశంలోనే ఇది జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు. లేని పక్షంలో త్వరలో భారీ ఎత్తున ఈ కార్యక్రమం నిర్వహించేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

రైతులకు దోమతెరలు పంపిణీ

దేవరపల్లి, జూలై 26: అధిక దిగుబడులకు ప్యాక్ట్ ఎరువులు ఎంతో దోహదపడతాయని భారత ప్రభుత్వ సంస్థ అయినా ప్యాక్ట్ కంపెనీ సేల్స్ ఆఫీసర్ కె.శ్రీనివాస్ అన్నారు. దేవరపల్లి సొసైటీ వద్ద శుక్రవారం ప్యాక్ట్ కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు దోమతెరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ దేవరపల్లి పరిసర ప్రాంతాల రైతులు ప్యాక్ట్ కంపెనీ ఎరువులను వాడడం సంతోషకరమన్నారు. తమ సంస్థ ద్వారా నాణ్యమైన ఎరువులను రైతులకు అందిస్తామన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కల్లూరి శ్రీనివాసశర్మ, కవల శ్రీనివాస్, పీహెచ్‌సీ డాక్టర్ సంజీవ్, ఉషారాణి, కుమారి పాల్గొన్నారు.

కోడిగుడ్ల సరఫరాలో నిర్లక్ష్యాన్ని సహించం

టీడీపీ నాయకుడు అల్లూరి విక్రమాదిత్య



అన్నదేవరపేటలో అధికారులు, కాంట్రాక్టరుతో మాట్లాడుతున్న విక్రమాదిత్య

తాళ్లపూడి, జూలై 26: పిల్లలకు పోషకాహారంగా అందించే కోడిగుడ్ల సరఫరాలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని నిబంధనల మేరకు సక్రమంగా కోడిగుడ్ల సరఫరా చేయాలని టీడీపీ నాయకుడు అల్లూరి విక్రమాదిత్య గుడ్ల సరఫరా కాంట్రాక్టర్ ప్రతినిధిని హెచ్చరించారు. అన్నదేవరపేటలోని అంగన్‌వాడీ సెంటరులో కుళ్లిన కోడిగుడ్ల బయట పడడంతో కోడిగ్డు సరఫరాకు సంబంధించిన ప్రతినిధి సతీష్ గ్రామానికి వచ్చారు. ఈ సందర్భంలోనే అంగన్‌వాడీ కేంద్రాల్లోనే కాకుండా మండల పరిషత్ ఉన్నత పాఠశాలకు సరఫరా చేసిన గుడ్లు కూడా అలానే ఉండడం వెలుగులోకి వచ్చింది. ఈ సంఘటనపై అంగన్‌వాడీ సూపర్‌వైజరు భాగ్యకుమారి, ఎంఈవో-2 నెహ్రూజీ అన్నదేవరపేట విచ్చేసి గుడ్లను పరిశీలించారు. వారానికి ఒక సారి సరఫరా చేయాల్సిన గుడ్లు 15 రోజులకు ఒకసారి సరఫరా చేస్తున్నారని, ఇకపై వారానికి ఒకసారి నాణ్యమైన కోడిగుడ్లు సరఫరా చేయాలని పాడైన గుడ్లు వెనక్కి తీసుకోవాలని కాంట్రాక్టరుకు తెలిపారు. విక్రమాదిత్య మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గద్దని పిల్లల ఆహార విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు.

ఈదురు గాలులతో వర్షం

పెరవలి, జూలై 26: రెండు రోజులుగా వాతావరణం తెరిపించడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. వారం పది రోజులు పాటు ఏకధాటిగా కురిసిన వర్షాలతో ఎక్కడికక్కడ చేలల్లో నీరు నిలిచిపోయి పంటలు ఊటబారిన పడే పరిస్థితికి చేరుకున్నాయి. శుక్రవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడా వర్షం కురిసింది.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ



ఇందిరమ్మ కాలనీలో ఫాగింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

చాగల్లు, జూలై 26: చాగల్లు పంచాయతీ పరిధిలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. వారం రోజులుగా గ్రామంలోని చెత్త కుప్పలను తొలగించడం, డ్రైన్‌లు శుభ్రపరుస్తున్నారు. గుంతలు పూడ్చి మురుగు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. దోమల నివారణకు రెండు రోజులుగా గ్రామంలో ఫాగింగ్ నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఇందిరమ్మ కాలనీలో ఫాగింగ్ చేశారు. అలాగే నివాసాల మధ్యలో ఉన్న ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగిపోయి దోమలు పెరిగిపోతున్నాయని, ఆయా స్థలాల యజమానులు పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ కార్యదర్శి ఎల్.రవికుమార్ చెప్పారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

దేవరపల్లి, జూలై 26: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయడానికి పోటీ పరీక్షలు దోహదం చేస్తాయని బాలోత్సవ్ కమిటీ మండల సభ్యుడు ఉండవల్లి కృష్ణారావు అన్నారు. మండలంలోని యర్నగూడెం జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు భారత రాజ్యాంగంపై శుక్రవారం వక్తృత్వ పోటీలు నిర్వహించారు. 125మంది పాల్గొనగా ఎస్.భార్గవి, ఎస్.ఈశ్వరి, సాయిదుర్గ, మొదటి మూడు స్థానాల్లో నిలిచి బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఊబా చంద్రరావు, బాలోత్సవ కమిటీ సభ్యులు ఆచంట సుభాష్‌చంద్రబోస్, చల్లా సూర్యచంద్రం, నలమాటి రామారావు, ముద్రగడ సురేష్, అయినపర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు సారె



కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం, జూలై 26: మండలంలోని పాలంగి గ్రామంలో కనక దుర్గమ్మకు ఆషాఢమాసం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పుట్టింటి వారైన వెలిచేటి వంశీకులు, అత్తింటి వారైన గన్నమని వంశీకులు సారె సమర్పణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తొలుత అమ్మవారికి పసుపుకుంకుమ, చీర, సారె, పానకం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, టీడీపీ మండలాధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ సహా పలువురు భక్తులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాడిరైతులకు దాణా అందజేత

పెరవలి, జూలై 26: ఇటీవల తుఫాన్ ప్రభావంతో పశు గ్రాసానికి కొరత ఏర్పడిందని, దీంతో స్పందించిన కలెక్టర్ ముక్కామల, ఖండవల్లి, పశువుల రైతులకు 25 మెట్రిక్ టన్నుల సమీకృతదాణా ఉచితంగా సరఫరా చేశారని దీనిని అందరూ సద్వినియోగించుకోవాలని టీడీపీ మండలాధ్యక్షుడు ఖండవల్లి ఉపసర్పంచ్ అతికాల రామకృష్ణమ్మ పేర్కొన్నారు. సుమారు 440 మంది రైతులకు ఈ దాణా అందజేశారు. ఈ సందర్భంగా ఖండవల్లిలో పశు వైద్య శిబిరం నిర్వహించి 200 పశువులకు టీకాలు, 40 పశువులకు వైద్యం అందించారు. కార్యక్రమంలో రవివర్మ, పశు సంవర్ధకశాఖ డీడీ రాధాకృష్ణ, డాక్టర్ రుషి ప్రసాద్, డాక్టర్ షల్మా పాల్గొన్నారు.

సెస్ రద్దుతో పొగాకు రైతులకు రూ.111 కోట్లు ఆదా

పొగాకు బోర్డు ఏఎం దామోదర్

దేవరపల్లి, జూలై 26: కేంద్ర వాణిజ్యశాఖ ఇటీవల పొగాకు రైతులకు అదనంగా పండించిన అమ్మకంపై సెస్ రద్దు చేయడంతో రాష్ట్రంలో పొగాకు రైతులకు రూ.111 కోట్లు ఆదా అయ్యిందని పొగాకు బోర్డు ఏఎం దామోదర్ తెలిపారు. దేవరపల్లి పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం పొగాకు రైతులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పొగాకు రైతులు పరిమితి మేరకే పొగాకు ఉత్పత్తి చేయాలని సూచించారు. పొగాకు రైతులు పండించిన పొగాకు అదనపు పన్ను రద్దు చేయాలని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్‌గోయల్‌తో ఇటీవల ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి కోరగా అదనపు పన్ను రద్దు చేయడం ఆనందదాయకమన్నారు. వచ్చే ఏడాది ఇలాగే సెస్ రద్దవుతుందని భావించవద్దన్నారు. ఒక్కొక్క పొగాకు రైతుకు రూ.80 వేల నుంచి లక్ష వరకు ఆదాయం కలిసివచ్చిందన్నారు. కార్యక్రమంలో దేవరపల్లి పొగాకు వేలం నిర్వహణాధికారి జీఎల్‌కే.ప్రసాద్, ఎస్‌జీఓ ప్రేమస్మిత, పొగాకు రైతు సంఘం అధ్యక్షులు కరుటూరి శ్రీనివాస్, రైతు సంఘం నాయకులు వెంకటేశ్వరరావు, కాట్రు సత్యనారాయణ, నాగరాజు, భీమరాజు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

తహశీల్దార్‌కు యూటీఎఫ్ నాయకుల వినతి



తహశీల్దార్ ఆచార్యులకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దేవరపల్లి, జూలై 26: ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని యూటీఎఫ్ మండల గౌరవాధ్యక్షుడు ఓరుగంటి శివనాగప్రసాద్‌రాజు అన్నారు. దేవరపల్లిలో శుక్రవారం ఉపాధ్యాయులు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ వైవీ ఆచార్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్‌రాజు మాట్లాడుతూ జీవో 117ను రద్దు చేయాలని, కిలోమీటర్ కంటే ఎక్కువ దూరంలో ఉన్న పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలని, పాఠశాలలకు మేనేజ్మెంట్ గ్రాంట్లు విడుదల చేయాలని, అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్, తెలుగు మీడియం సమానంగా ఉండాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే సిలబస్ ఒకే పరీక్షా విధానం అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలన్నారు. బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎల్.రామారావు, నాగేంద్రప్రసాద్, ఉమాకాంత్, రవికుమార్, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు



కార్యక్రమంలో మాట్లాడుతున్న జనసేన ఇన్‌చార్జి సువర్ణరాజు

గోపాలపురం, జూలై 26: జనసేన బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కష్టించి పని చేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జి సువర్ణరాజు అన్నారు. మండలంలోని దొండపూడిలో మండలాధ్యక్షుడు పోల్నాటి రాజేంద్ర, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎస్‌కే.హుస్సేన్ ఆధ్వర్యంలో క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. సభ్యత్వంలో తీసుకోవడం వల్ల జరిగే ప్రయోజనాలను సువర్ణరాజు వివరించారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, గణపతి, రామ్‌లీలాధర్, మద్దాల సనారి, వీరాస్వామి, తదితరులు పాల్గొన్నారు.

తెరపైకి భీమోలు భూముల వివాదం

తీర్పు వచ్చే వరకూ భూముల్లోకి వెళ్లొద్దు: పోలీసులు

గోపాలపురం, జూలై 26: మండలంలోని భీమోలు గ్రామంలో భూముల వివాదం మరోసారి తెరమీదకు వచ్చింది. కొన్నేళ్లుగా పట్టాదారులు, కౌలుదారుల మధ్య భూవివాదం ఉన్న విషయం తెలిసిందే. అయితే ప్రతి ఏటా వరినాట్ల సమయంలో ఈ సమస్య తలెత్తుతోంది. అందులో భాగంగానే శుక్రవారం మరోసారి భీమోలులో ఇరువర్గాల మధ్య వివాదం తలెత్తింది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో కౌనుగోలుదారులు నాట్లు వేసేందుకు సిద్ధమయ్యారు. అదే తరుణంలో భీమోలుకు చెందిన పట్టాదారులు పనులను అడ్డగించే ప్రయత్నం చేశారు. దీంతో ఇన్‌చార్జ్ డీఎస్పీ శ్రీనివాస్‌మూర్తి, దేవరపల్లి సీఐ బాలసురేష్ బాబు, దేవరపల్లి, గోపాలపురం ఎస్ఐలు శ్రీహరి, సతీష్ సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి పట్టాదారులతో మాట్లాడారు. అనంతరం ఇరువర్గాలను గోపాల పురం పోలీస్‌స్టేషన్‌కు రప్పించి ఈ భూములు ఎవరికి చెందుతాయో న్యాయ స్థానాల నుంచి స్పష్టమైన తీర్పు వచ్చే వరకు ఎవరూ ఆ భూముల్లోకి వెళ్లొద్దని హెచ్చరించారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు ఎవరైన విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇరువర్గాలను పోలీసులు హెచ్చరించారు.

మాజీ ఎమ్మెల్యే శేషారావును కలిసిన రైస్‌మిల్లర్స్



ఉండ్రాజవరం, జూలై 26: ఉండ్రాజవరం, పెరవలి మండలాల రైస్ మిల్లర్లకు సంబంధించిన గోస్తని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు శుక్రవారం వేలివెన్నులోని ఆయన స్వగృహంలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఈర్పిన సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ప్రగడ కోటయ్య జయంతి

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 26: పద్మశాలీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇమంది కన్నారావు, యువజన విభాగం అధ్యక్షుడు తీడ ఆదిబాబు ఫ్రంట్ రాజమండ్రి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం తుమ్మలావ భావనాఋషి ఆలయ ప్రాంగణంలో రాజ్యసభ మాజీ సభ్యుడు ప్రగడ కోటయ్య 109వ జయంతిని నిర్వహించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రియుడి వేధింపులు తాళలేక

గర్భిణి ఆత్మహత్య

పోతవరంలో ఘటన.. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు



విజయదుర్గ(ఫైల్)

నల్లజర్ల, జూలై 26: ప్రియుడి వేధింపులు తాళలేక మూడు నెలల గర్భిణీ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని పోతవరంలో జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. పోతవరం గ్రామానికి చెందిన బాకీ వెంకట్రావు, నాగలక్ష్మి దంపతుల ఏకైక కుమార్తె విజయదుర్గ(21) ఈ ఏడాది మార్చి నెల వరకు గ్రామంలో వలంటీర్‌గా పని చేసింది. ఏప్రిల్ 3న ఏలూరు జిల్లా పూళ్ల గ్రామానికి చెందిన లక్ష్మణ్‌ఈశ్వర్‌తో వివాహం జరిగింది. ఆషాఢ మాసం కావడంతో విజయదుర్గ పుట్టింటికి పోతవరం వచ్చింది. అదే గ్రామానికి చెందిన ప్రియుడు సిమెంట్ పనులకు వెళ్లే దెబ్బెం ధనరాజు వేధింపులకు పాల్పడుతున్నాడు. విజయదుర్గ తనకు పెళ్లయిందని ఇంతటితో వదిలేయమని ప్రాధేయపడింది. అయినా పట్టించుకోకుండా పదే పదే వేధించడంతో హెచ్చరించింది. దీంతో కక్ష పెంచుకున్న ధనరాజు గతంలో తనతో సన్నిహితంగా ఉన్న ఫొటోలు, ఫోన్ సంభాషణ పూళ్లలో ఉంటున్న విజయదుర్గ భర్తకు పంపించాడు. దీంతో భర్త ఫోన్‌లో మందలించడంతో వారి మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. జీవితంపై విరక్తి చెందిన విజయదుర్గ బుధవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు వచ్చి ముందుగా నల్లజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.ఆపై మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. విజయదుర్గ మృతిని అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

భర్త వివాహేతర సంబంధాన్ని పట్టించిన భార్య

నల్లజర్ల, జూలై 26: మండలంలోని ప్రకాశరావుపాలెంలో భర్త అక్రమ సంబంధాన్ని పోలీసుల సహాయంతో అతడి భార్య రెడ్ హ్యాండెడ్‌గా పట్టించి పోలీస్‌స్టేషన్‌కు చేర్చింది. వివరాలిలా ఉన్నాయి. జొన్నకూటి రవికుమార్ ప్రకాశరావుపాలేనికి చెందిన మహిళను వివాహం చేసుకుని ఇక్కడే ఉంటూ లైటింగ్ పనులు చేస్తున్నాడు. వీరికి ముగ్గురు ఆడపిల్లలు. రవికుమార్ ఇటీవల చిన్నయల్లమిల్లికి చెందిన మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో పలుమార్లు భార్యాభర్తలు గొడవలు పడి పోలీస్‌స్టేషన్లకు వెళ్లారు. అయినప్పటికీ వివాహేతర బంధం వీడకపోవడంతో భర్త కదలికపై భార్య కన్నేసింది. శుక్రవారం తెల్లవారుజామున గ్రామం శివారు షెడ్‌లో ఉన్నట్టు మరో మహిళతో ద్వారా పక్కా సమాచారం తెలుసుకుంది. 100 నెంబరుకు ఫోన్‌చేసి పోలీసులు వచ్చే వరకు అక్కడే ఉండి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టించింది. దీంతో పోలీసులు ఇద్దరినీ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇరువర్గాలతో మాట్లాడుతున్నారు. ఇప్పటి వరకు కేసు నమోదు కాలేదు.

డిజిటల్ టెక్నాలజీతో ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థులు చేసిన రోబోను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

బిక్కవోలు, జూలై 26: విద్యార్థులు డిజిటల్ టెక్నాలజీని సక్రమంగా వినియోగిస్తే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పందలపాక జెడ్పీస్కూల్ హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి సూచించారు. పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం డిజిటల్ టెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన, ప్రాక్టికల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సైన్స్ ఉపాధ్యాయులు టి. జయకృష్ణారెడ్డి, శ్యామ్ సారథ్యంలో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో వివిధ డిజిటల్ మోడల్స్ ప్రదర్శించి వివరించారు. ప్రభుత్వం అందజేసిన టాబ్స్, ప్లాట్ ప్యానల్స్ గూర్చి వివరించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన వివిధ మోడల్స్ ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ కోనాల సత్తిరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రం

రేవులు, పునరావాస కేంద్రాలు తనిఖీలో కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 26: రాజమహేంద్రవరంలో ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రం చేయడం, పాగింగ్ చేయడం వంటి పనులు పక్కాగా చేయిస్తున్నామని మునిసిపల్ కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. శుక్రవారం ఆయన రాజమహేంద్రవరంలో గోదావరి స్నానాల రేవులను, వరద బాధితుల పునరావాస కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గోదావరి స్నానాల రేవులను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఎటువంటి ఇన్‌ఫెక్షన్స్ సోకకుండా బ్లీచింగ్ పౌడరు చల్లడం వంటివి చేయిస్తున్నామన్నారు. నగరంలో ఆల్కాట్ గార్డెన్స్ నగరపాలక సంస్థ కళ్యాణ మండపంలో ఉన్న 250 మందికి, చందా సత్రంలో ఉన్న 198 మందికి అల్పాహారం, భోజనం, సాయంత్రం స్నాక్స్ అందిస్తున్నామన్నారు. అందుబాటులో వైద్య శిబిరం కూడా ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, ఎస్ఈ జి.పాండురంగారావు, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న పాల్గొన్నారు.

రూ.4.80 లక్షలు రికవరీ చేయాలి

డ్వామా పీడీ.. రాజానగరంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక

రాజానగరం, జూలై 26: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలో జరిగిన పనులకు సంబంధించి రూ.4.80 లక్షలు రికవరీ చేయాలని డ్వామా పీడీ ఎ.ముఖలింగం ఆదేశించారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి నెలాఖరు వరకూ మండలంలో జరిగిన ఉపాధిహామీ పనులకు సంబంధించి మండల స్థాయి సామాజిక తనిఖీ ప్రజావేదిక సదస్సు శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జరిగింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పథకం, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలకు సంబంధించి రూ.13,09,82,933 విలువైన 2025 పనులు జరిగినట్టు నివేదికలో పేర్కొన్నారు. అయితే గృహనిర్మాణాలకు సంబంధించి జరిగిన చెల్లింపుల్లో రూ.3 లక్షలు, ఉపాధి పనుల్లో రూ1.80 లక్షలను రికవరీ చేయాలని ఆదేశించారు. నిబంధనలకు అనుగుణంగా కూలీలకు పనులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో డ్వామా ఏపీడీ బి.రామ్‌ప్రసాద్, ఎంపీడీవో జ్యోతిర్మయి, ఎస్‌టీఎం గౌరీశంకర్, వెలుగు డీపీఎం గణేశ్వరరావు, అధికారులు ఎస్.ఖాదర్‌బాషా, డీఏవీ నరేష్, ఎస్.నరేష్‌బాబు పాల్గొన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ వై.స్క్రీన్1	కల్కి
వై.స్క్రీన్2	భారతీయుడు-2
దేవిశ్రీ(గాయత్రి)	ప్రభుత్వ జూనియర్ కళాశాల
అనన్య	భారతీయుడు-2
నిడదవోలు	
వీ మ్యాక్స్	డెడ్‌పూల్
రాధాకృష్ణ	రాయన్
శ్రీగణపతి	కల్కి
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	కల్కి
శ్రీరామ్ సినీ మ్యాక్స్	కల్కి
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1	భారతీయుడు-2
స్క్రీన్ 2	కల్కి
శ్రీనివాస	---